VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 05.07.2026
సంపుటి : 08 సంచిక : 26 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



## హైదరాబాద్‌లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేషనల్ లీగల్ కాంక్లేవ్

# 20 ఏళ్లలో ఒక్క రోజూ సెలవు తీసుకోలేదు

**సీఎం రేవంత్‌రెడ్డి**





- మిడ్జిల్ ప్రజలే నా రాజకీయ జీవితానికి పునాది అన్న ముఖ్యమంత్రి
- వచ్చిన అవకాశాన్ని ఎప్పుడూ దుర్వినియోగం చేయలేదని స్పష్టం
- ప్రతిపక్షంలో ప్రజల గొంతుగా.. అధికారంలో సమస్యల పరిష్కారమే లక్ష్యమని వ్యాఖ్య
- 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం సందర్భంగా మిడ్జిల్‌లో కృతజ్ఞత సభ
- మిడ్జిల్‌ను దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి
- డార్క్ ఏరియాగా ఉన్న మిడ్జిల్‌ను అభివృద్ధి మండలంగా తీర్చిదిద్దుతామని హామీ
- ఎస్సీ ఉపవర్గీకరణ, బీసీ కులగణనతో చారిత్రక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడి
- గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని వ్యాఖ్య
- పాలమూరు అభివృద్ధికి జీవితాంతం కృషి చేస్తానన్న సీఎం

# హిందువులారా... జాగోరే

- సర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోంది
- హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది
- ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం
- అధికారులకు ప్రభుత్వం సహకరించడం లేదు
- మజ్లిస్ తో కుమ్మక్కై కాంగ్రెస్ హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది
- కష్టపడి పనిచేసి క్షేత్రస్థాయి నుండి ఎదిగే లీడర్ ను సమాజం గౌరవిస్తుంది



- 20 ఏళ్ల రేవంత్ రాజకీయ జీవితానికి శుభాకాంక్షలు
- 6 గ్యారంటీలను అమలు చేయాలని కోరుతున్నా...
- అప్పులు, అవినీతి, అక్రమాలు తప్ప చేసిందేమీ లేదు
- కేంద్ర నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి

## దేశ ఇంధన భద్రతలో సింగరేణిది కీలక పాత్ర



- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- సింగరేణి భవన్‌లో అధికారులతో కీలక సమీక్ష
- నీలిరంగు యూనిఫామ్‌తో హాజరు
- కార్మికుల శ్రమకు గౌరవం

# 20 ఏళ్ల ప్రజాసేవ పూర్తి..



- సీఎం రేవంత్‌కు మంత్రుల అభినందనలు
- 20 ఏళ్ల ప్రజా ప్రస్థానానికి గుర్తింపు
- సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు
- మిడ్జిల్ జెడ్పీటీసీగా మొదలైన ప్రయాణం ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన రేవంత్
- ప్రజాసేవకు ప్రశంసలు తెలిపిన సహచరులు
- సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన భట్టి
- పలువురు మంత్రుల మర్యాదపూర్వక భేటీ
- ప్రజా జీవిత మైలురాయిపై అభినందనలు
- రాజకీయ ప్రస్థానాన్ని కొనియాడిన నేతలు



- సీఎంకు శుభాకాంక్షలు వెల్లువ

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

మిడ్జిల్ మండలం జెడ్పీటీసీగా ప్రజా జీవితాన్ని ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్‌రెడ్డి ప్రజాసేవలో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు మంత్రులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రజా జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రులు, ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మిడ్జిల్ మండల జెడ్పీటీసీగా ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరడం విశేషమని పేర్కొంటూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# పోలీస్ కొలువుల్లో కోతలు తగదు

- నిరుద్యోగులను కాంగ్రెస్ నిలువునా ముంచింది
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధ్వజం
- ప్రభుత్వ ప్రకటనపై తీవ్ర ఆగ్రహం
- 20 వేళ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వెల్లడి
- నిరుద్యోగులు పోరాడాలని పిలుపు
- ఉద్యోగాల కోసం అండగా ఉంటామని హామీ



**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రకటనపై రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టుల భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై విపక్షాలు మండిపడుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం కేవలం 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి మాత్రమే అనుమతి ఇవ్వడంపై బీజేపీ శాసనసభా పక్ష (బీజేఎల్పీ) నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలో వేలాది పోస్టులు ఖాళీగా ఉంటే, తక్కువ సంఖ్యలో భర్తీ చేయడం నిరుద్యోగులను వంచించడమేనని ఆయన దుయ్యబట్టారు.

▶ మిగతా 2లో

# టీఆర్ఎస్ పేరుపై వెనక్కి తగ్గం: కవిత

- కొత్త పేర్ల ప్రసక్తే లేదన్న మాజీ ఎమ్మెల్సీ
- టీఆర్ఎస్ పేరుతోనే ముందుకు వెళ్తామని స్పష్టం
- అవసరమైతే న్యాయ పోరాటానికి సిద్ధమని వెల్లడి
- ఈసీ సూచనపై గట్టి వైఖరి ప్రకటించిన కవిత
- పార్టీ పేరుపై రాజీ పడబోమని స్పష్టీకరణ
- 15 రోజుల్లో కొత్త పేర్లు ఇవ్వాలని ఈసీ ఆదేశం



- లేకపోతే దరఖాస్తు క్లోజ్ చేస్తామని హెచ్చరిక
- టీఆర్ఎస్ పేరుపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఈసీ
- తీర్పు కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని సంకేతం
- పార్టీ గుర్తింపును కాపాడుకుంటామని స్పష్టం

## పశ్చిమాసియా ఇంధన సంక్షోభాన్ని విజయవంతంగా ఎదుర్కొన్నాం: ప్రధాని మోదీ



- సంక్షోభ సమయంలో ఇంధన దిగుమతులు 26 దేశాల నుంచి 40 దేశాలకు విస్తరణ
- చమురు కంపెనీలకు రూ.75 వేల కోట్ల నష్టాన్ని ప్రభుత్వమే భరించిందన్న ప్రధాని

## తెలంగాణ పర్యాటక సంస్కరణలకు నీతి ఆయోగ్ ప్రశంస

- నీతి ఆయోగ్ ప్రశంసలు తెలంగాణ పర్యాటక రంగానికి దక్కిన జాతీయ గుర్తింపు: మంత్రి జూపల్లి కృష్ణారావు
- తెలంగాణ విధానాలు దేశానికే ఆదర్శం





## అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి

- క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు

## ఆదర్శ రాజకీయ నాయకుడు కొణిజేటి రోశయ్య: మంత్రి వివేక్ వెంకటస్వామి

- రవీంద్రభారతిలో ఘనంగా రోశయ్య 93వ జయంతి సభ
- ప్రజా ప్రయోజనమే ప్రామాణికంగా నిర్ణయాలు తీసుకునేవారు



# 20 ఏళ్లలో ఒక్కరోజూ...

(మొదటి పేజీ తరువాయి)

**మిడ్జిల్ వెలుతురు జూలై 04:**

గడిచిన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఎప్పుడూ దుర్వినియోగం చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుగా పోరాడానని, అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు అభివృద్ధి, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చానని పేర్కొన్నారు.తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. అంతకుముందు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.2006 జూలై 4న జడ్పీటీసీగా తన విజయం వ్యక్తిగత గెలుపు కాదని, మిడ్జిల్ ప్రజల విజయం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్కే నేడు మహావృక్షంగా ఎదిగిందని వ్యాఖ్యానించారు. మిడ్జిల్ ప్రజలు తనను పెంచి పోషించారని, ఆ ఋణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.మిడ్జిల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన మండలంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. గతంలో డార్క్ ఏరియాగా గుర్తింపు పొందిన ఈ మండలం ఇకపై వెలుగు నిండిన అభివృద్ధి ప్రాంతంగా ప్రభుత్వ రికార్డుల్లో నిలవాలని అన్నారు. ఈ లక్ష్యంతో మిడ్జిల్ మండలాన్ని దత్తత తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు.హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి, మహేంద్రనాథ్, ద్యాప గోపాల్‌రెడ్డి వంటి మహానేతలను ఈ ప్రాంతం దేశానికి అందించిందని సీఎం గుర్తు చేశారు. వారి స్ఫూర్తితోనే ప్రజాసేవలో ముందుకు సాగుతున్నానన్నారు.జడ్పీటీసీగా పనిచేసిన రోజుల్లో చాలా గ్రామాలకు రోడ్లు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు



కూడా లేవని గుర్తుచేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో మిడ్జిల్, గద్వాల్‌లోని గట్టు మండలాలను డార్క్ ఏరియాలుగా ప్రకటించిన పరిస్థితి ఉండేదని తెలిపారు.ముఖ్యమంత్రిగా అవకాశం రావడంతో నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యను పరిష్కరించామని, వందేళ్లుగా జరగని బీసీ కులగణనను చేపట్టి చరిత్ర సృష్టించామని చెప్పారు. లెక్కలు తేల్చడమే కాకుండా వారి వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.తాను గ్రామంలో పుట్టి పెరిగిన వ్యక్తినని, రైతు కష్టాలు, పేదవాడి జీవితం, వ్యవసాయం అన్నీ ప్రత్యక్షంగా తెలుసని సీఎం చెప్పారు. భూమికి విత్తనానికి ఉన్న బంధం ఎంత గొప్పదో, పాలకుడికి ప్రజలతో ఉండాల్సిన అనుబంధం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.గ్రామాలు అభివృద్ధి చెందితేనే మండలం, జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని రేవంత్‌రెడ్డి అన్నారు. మిడ్జిల్ ప్రజలు తనకు ఎంతో ఇచ్చారని, ఈ మండలానికి ఏమిచ్చినా తక్కువేనని చెప్పారు. వలసల పాలమూరును అభివృద్ధి పథంలో నడిపించడం తన బాధ్యత అని, అవసరమైతే ప్రాణాలైనా అర్పిస్తానని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

# పోలీస్ కొలువుల్లో కోతలు తగదు...

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పోలీస్ శాఖలో సుమారు 5 వేల ఉద్యోగాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ నిర్ణయం నిరుద్యోగ యువతను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న ఈ అనాలోచిత నిర్ణయంపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రస్తుతం అధికారికంగా, అనధికారికంగా దాదాపు 20 వేల వరకు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గుర్తుచేశారు. ఇంత భారీ సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉంటే, కేవలం 5 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేస్తామనడం వెనుక అంతరార్థం ఏంటని ఆయన నిలదీశారు. మిగిలిన 15 వేల పోస్టుల పరిస్థితి ఏంటని, వాటిని ఎప్పుడు భర్తీ చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏలేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికారని విమర్శించారు. నిరుద్యోగుల ఆశలను పెట్టుబడిగా పెట్టుకుని, వారి ఓట్లతో అధికార పీఠం దక్కించుకున్న కాంగ్రెస్, ఇప్పుడు ఉద్యోగాల భర్తీలో కోతలు విధిస్తూ తన అసలు నైజం బయటపెట్టుకుందని ధ్వజమెత్తారు.ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో ఉంటూ, రాత్రింబగళ్లు కష్టపడి చదువుకుంటున్న లక్షలాది మంది పోలీస్ అభ్యర్థుల ఆశలపై ఈ నిర్ణయం నీళ్లు చల్లిందని ఏలేటి ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో నోటిఫికేషన్ వస్తుందని ఆశించిన అభ్యర్థులకు ఈ ఐదు వేల పోస్టుల ప్రకటన పెద్ద శరాఘాతంగా మారిందన్నారు. కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం దేవుని ఎరుగు, ఉన్న ఆశలు కూడా అడుగంటుతున్నాయని ఎద్దేవా చేశారు.తమకు న్యాయం చేయాలని, ఖాళీల సంఖ్యను పెంచాలని శాంతియుతంగా పోరాటం చేస్తున్న పోలీస్ అభ్యర్థుల పట్ల ప్రభుత్వం అత్యంత అహంకారంగా వ్యవహరిస్తోందని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న యువతీ యువకుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వారిపై ఎదురుదాడి చేయడం సరికాదన్నారు. అభ్యర్థులపై అక్రమ కేసులు బనాయించి, అర్ధరాత్రి అరెస్టులు చేయించడం దుర్మార్గమైన చర్య అని ఖండించారు.పోలీస్ ఉద్యోగార్థులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లన్నింటికీ భారతీయ జనతా పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. నిరుద్యోగులు తమ పోరాటంలో ఒంటరి వాళ్లు కారని, వారికి అండగా నిలబడేందుకు బీజేపీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిర్బంధాలకు భయపడకుండా తమ హక్కుల సాధన కోసం అభ్యర్థులు ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఏలేటి పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు రావాల్సిన న్యాయమైన హక్కులు, ఉద్యోగాలు దక్కేంత వరకు తాము ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరించారు. అసెంబ్లీ లోపల, బయట కూడా నిరుద్యోగుల గొంతుకగా బీజేపీ నిలుస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి పూర్తి స్థాయి ఖాళీలను భర్తీ చేసేలా నోటిఫికేషన్ ఇచ్చేంతవరకు రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు.పోలీస్ కొలువుల కోతపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారమే రేపుతున్నాయి. ఒకవైపు నిరుద్యోగుల ఆందోళనలు, మరోవైపు ప్రతిపక్షాల విమర్శలతో రాష్ట్రంలో ఉద్యోగాల కాక రేగుతోంది. ఈ వ్యవహారంపై అధికార కాంగ్రెస్ పార్టీ ఎలా స్పందిస్తుందో, రాబోయే రోజుల్లో నిరుద్యోగుల ఆగ్రహాన్ని చల్లార్చడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

# అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి

- **ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలి**
- **అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్ధేశం**

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని , ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ "గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలి. క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ , హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలి.వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయి. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# హిందువులారా...జాగోరే

- **కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు చేసింది శూన్యం**
- **రెండు పార్టీలు కలిసి రూ.10 లక్షల అప్ప చేసి జనంపై భారం మోపారు**
- **తెలంగాణను శ్రీలంక, పాకిస్తాన్ లా మార్చే ప్రమాదం**
- **గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం 14, 15 ఆర్థిక సంఘం నిధులిస్తే... జీతాలిస్తూ డైవర్ట్ చేస్తున్నారు**
- **అప్పల ఊబి నుండి బయటకు రావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందే**
- **వీబీజీ రామ్ జీ పథకంతో పనిదినాలు పెంచి ఆస్తులు సృష్టించడం తప్పా?**
- **దీనిపై కోర్టుకు వెళ్లడం ఏంది?**
- **మోదీకి మంచి పేరొస్తే ఓర్వలేరా?**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్**
- **వేములవాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి**

**వేములవాడ వెలుతురు జూలై 04:**

రాష్ట్ర ప్రభుత్వం "సర్" ను ఉపయోగించుకుని హిందువల ఓట్లను తొలగించేందుకు పెద్ద ఎత్తున కుట్ర చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. సర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు సహకరించడం లేదన్నారు. ఫలితంగా అధికారులు క్షేత్రస్థాయిలో హిందువుల ఇండ్లకు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదన్నారు. తెలంగాణలోని హిందువులంతా జాగ్రుతం కావాలని, లేనిపక్షంలో తెలంగాణలో హిందువులంతా మైనారిటీలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. శనివారం రోజున వేములవాడ నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా మేడిపల్లి, బీమారం, కథలాపూర్ మండలాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. అందులో భాగంగా కాచారం గ్రామంలో 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. మరో 10లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దమ్మన్నపేట గ్రామంలో 8 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దేశాయ్ పేట్ లో 9 లక్షల రూపాయల MP లాడ్స్ నిధులతో నిర్మించిన బస్టాండ్ ను ప్రారంభించారు. మరో 36 లక్షల వ్యయంతో నిర్మించిన CC రోడ్డు ప్రారంభించారు. మన్నెగూడెంలో 10 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఇక కథలాపూర్ మండలం విషయానికొస్తే... గంబీర్ పూర్ లో 4 లక్షల 50 వేల వ్యయంతో సీసీ డ్రెయిన్, పోసానిపేటలో 5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, దూంపేటలో 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమారం మండలం దేశాయ్ పేటలో మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే.జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గం మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడానికి రావడం సంతోషంగా ఉంది. ఏ ప్రాంతం బాగుపడాలన్నా ముందు రవాణా సౌకర్యాలు బాగుంటేనే సాధ్యమవుతుంది. అందుకే నేను ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటి వరకు అత్యధిక ప్రాధాన్యత రోడ్ల నిర్మాణానికే ఇచ్చాను. మోదీ గారి ఆశీస్సులు, నితిన్ గడ్కరీ గారి సహకారంతో గ్రామీణ ఉపాధి హామీ, ప్రధానమంత్రి సడక్ యోజన, CRIF నిధులతోపాటు జాతీయ రహదారుల విస్తరణ కోసమే ఎక్కువ నిధులు తీసుకొచ్చిన.

### రోడ్ల కోసమే రూ.10 వేల కోట్లు ఖర్చు చేసినం...

గత 7 ఏళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం 22 వేల కోట్లకుపైగా కేంద్ర నిధులు తీసుకొస్తే, అందులో రోడ్ల నిర్మాణం కోసమే 10 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు ఖర్చు చేసినం. వేములవాడ నియోజకవర్గంలోనే ఇటీవల మల్యాల నుండి కాచారం వరకు, సిరికొండ నుండి వేములవాడ వరకు 20 కోట్లతో, మేడపల్లి నుండి గోవిందారం వరకు రూ.25 కోట్లతో, సిరికొండ నుండి వేములవాడ వరకు రూ.23 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన. కేవలం జాతీయ రహదారుల విస్తరణ కోసమే 5 వేల కోట్ల రూపాయలు తీసుకొచ్చినం. దీంతోపాటు CRIF (సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్), జాతీయ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి మిగిలిన నిధులు తీసుకొచ్చి ఖర్చు చేస్తున్నం. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గంలో ఎంపీగా పనిచేసిన ఏ నాయకుడు కూడా ఈ స్థాయిలో నిధులు తీసుకు వచ్చిన దాఖలాలు లేవు. అందులో భాగంగా 2 వేల 147 కోట్ల నిధులతో కరీంనగర్-వరంగల్ నేషనల్ హైవే పనులను పూర్తి చేసుకుని దసరా నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. అట్లాగే 578 కోట్ల రూపాయలతో ఎల్కతుర్తి-సిద్దిపేట నేషనల్ హైవే పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. ఈ ప్రాంత చిరకాల వాంఛ అయిన కరీంనగర్, జగిత్యాల హైవే విస్తరణ పనులను ప్రారంభించుకోబోతున్నాం. 2 వేల 3 కోట్లకుపైగా నిధులు మంజూరయ్యాయి. CRIF నిధులను సైతం పెద్ద ఎత్తున కరీంనగర్ పార్లమెంట్ కు తీసుకొచ్చిన. గతంలో తెలంగాణ మొత్తానికి 800 కోట్ల సీఐఆర్ఎఫ్ నిధులు మంజూరైతే... అందులో ఒక్క కరీంనగర్ పార్లమెంట్ కే 291 కోట్లు తీసుకొచ్చి 1341 కిలోమీటర్ల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లను నిర్మించిన ఘనత సాధించినం. అట్లాగే జాతీయ ఉపాధి హామీ పథకం కింద (వచ్చే జులై 1 నుండి వీబీజీ రామ్ జీ స్కీంగా పేరు మారబోతోంది) రోడ్ల నిర్మాణం కోసమే దాదాపు వెయ్యి కోట్ల దాకా ఖర్చు చేసుకున్నం. గ్రామీణ సడక్ యోజన పథకం కింద వందలాది కోట్లు ఖర్చు చేసి రోడ్లు నిర్మించినం.

### అభివృద్దే నా లక్ష్యం...

ఎన్నికలప్పుడే రాజకీయాలు. ఎన్నికల తరువాత నా ధ్యాస, శ్వాస అంతా అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఇంకా పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా. గ్రామగ్రామాన, గల్లీగల్లీలో రోడ్లు వేయిస్తా. రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకుంటూ పార్లమెంట్ అభివృద్ధికి క్రుషి చేస్తా. కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే వివక్ష లేకుండా ఓటేసిన ప్రజల ఆకాంక్ష మేరకు చేయి చేయి కలుపుదాం... వేములవాడ, సిరిసిల్లసహా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం. కలిసి రావాలని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను, నాయకులను కోరుతున్నా...

### అప్పులు, అవినీతి, అక్రమాలు తప్ప ఆ రెండు పార్టీలు చేసిందేమిటి?

ఇయాళ పేపర్లలో చూసిన బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 8 లక్షల 21 వేల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ రెండున్నరేళ్లలో 1 లక్షా 77 వేల కోట్లు అప్పు చేసిందట. రాష్ట్ర ఆర్థిక మంత్రే ఈ లెక్కలు చెప్పారు. అంటే ఇద్దరూ కలిసి 10 లక్షల కోట్ల అప్పును తెలంగాణ ప్రజలపై మోపారు. ఇంత అప్పు చేసి ఏం చేశారంటే... చేసిందేమీ లేదు. ఇయాళ జీతాలు, పెన్షన్లు, ఫీజు రీయంబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలంటే కూడా పైసల్లేని దుస్థితి ఏర్పడింది. రెండు పార్టీల 12 ఏళ్లలో చేసిందేమిటంటే... అప్పులు, అవినీతి, అక్రమాలు మాత్రమే. బీఆర్ఎస్ పాలనలో దోచుకున్న సొమ్మునంతా ఫాంహౌజ్ కు తరలిస్తే... కాంగ్రెస్ పాలనలో దోచుకున్నదంతా ఢిల్లీకి పెద్దలకు మూటలు పంపుతున్నారు. అంతే తేడా. రెండు పార్టీలు అవినీతి, అక్రమాల్లో సేమ్ టు సేమ్. రాష్ట్రంలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతుందంటే... కేంద్రం ఇస్తున్న నిధులతోనే... అయినా కేంద్రం ఏమీ ఇవ్వడం లేదంటూ రెండు పార్టీలు డ్రామాలాడుతూ.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ బిగ్ బాస్ షోను తలపించేలా నాటకాలాడుతున్నయి. రెండు పార్టీలు కలిసి రూ.10 లక్షల అప్పు చేసి జనంపై భారం మోపారు. తెలంగాణను శ్రీలంక, పాకిస్తాన్ లా మార్చే ప్రమాదం ఏర్పడింది. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం 14, 15 ఆర్థిక సంఘం నిధులిస్తే... జీతాలిస్తూ డైవర్ట్ చేస్తున్నారు. అప్పుల ఊబి నుండి బయటకు రావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందే. తెలంగాణ ప్రజలను కోరేదొక్కటే. ఆ రెండు పార్టీలను ఎలిమినేట్ చేయండి. డబుల్ ఇంజన్ సర్కార్ కు అవకాశమివ్వండి. బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణలో అప్పుల బాధ తీరుతుంది. అవినీతి రహిత పాలనతో అభివృద్ధి జరుగుతుంది.

### వీబీజీ రామ్ జీపై కోర్టుకు వెళ్లడమేంది?

వీబీజీ రామ్ జీ పథకంతో పనిదినాలు పెంచి ఆస్తులు స్రుష్టించడం తప్పా. దీనిపై కోర్టుకు వెళ్లడం ఏంది?. మోదీకి మంచి పేరొస్తే ఓర్వలేరా?. సర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోంది. హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం ఏర్పడింది. అధికారులకు ప్రభుత్వం సహకరించడం లేదు. మజ్లిస్ తో కుమ్మక్కై కాంగ్రెస్ హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది.

### రేవంత్ కు శుభాకాంక్షలు..

కష్టపడి పనిచేసి క్షేత్రస్థాయి నుండి ఎదిగే లీడర్ ను సమాజం గౌరవిస్తుంది. అందులో భాగంగా 20 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు. కేసీఆర్ కూడా కష్టపడి పైకొచ్చిన నాయకులే. కానీ ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని కోరుతున్నా...

# టీఆర్ఎస్ పేరుపై వెనక్కి తగ్గం: కవిత

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ పార్టీ పేరుపై వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. కొత్త పేర్లు సూచించే ప్రసక్తే లేదని, టీఆర్ఎస్ పేరుతోనే పార్టీ కొనసాగుతుందని ఆమె తేల్చిచెప్పారు. అవసరమైతే న్యాయపోరాటానికీ సిద్ధమని ప్రకటించారు.టీఆర్ఎస్ పేరుతో పార్టీ నమోదు చేసుకునే ప్రక్రియలో ఆ పేరుపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన భారత ఎన్నికల సంఘం (ఈసీ), 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. లేనిపక్షంలో పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది.ఈ నేపథ్యంలో స్పందించిన కవిత.. పార్టీ పేరుపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ పేరే కొనసాగుతుందని, అవసరమైతే చట్టపరమైన పోరాటం చేసి అయినా పార్టీ పేరును కాపాడుకుంటామని పేర్కొన్నారు. దీంతో ఈ వ్యవహారం ఎన్నికల సంఘం నుంచి న్యాయస్థానానికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# దేశ ఇంధన భద్రతలో సింగరేణిది కీలక పాత్ర

- **త్యాగానికి ప్రతీకగా యూనిఫామ్**
- **కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**
- **సింగరేణి భవన్‌లో అధికారులతో కీలక సమీక్ష**
- **నీలిరంగు యూనిఫామ్‌తో హాజరు**
- **కార్మికుల శ్రమకు గౌరవం**
- **త్యాగానికి ప్రతీకగా యూనిఫామ్**
- **సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నా సింగరేణి సేవలను కొనియాడిన మంత్రి**
- **కార్మికులకు అభినందనలు, కృతజ్ఞతలు**
- **ఎక్స్‌లో భావోద్వేగ సందేశం**
- **'జై సింగరేణి.. జై తెలంగాణ' నినాదం**

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం సింగరేణి సంస్థకు సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సింగరేణి కార్మికులు ధరించే నీలిరంగు యూనిఫామ్ వేసుకుని హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు. సమావేశానికి సంబంధించిన ఫొటోలను ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పంచుకున్నారు.ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. తాను ధరించినది కేవలం ఒక యూనిఫామ్ మాత్రమే కాదని, సింగరేణి కార్మికుల చెమట చుక్కలు, త్యాగం, కష్టపడే తత్వం, ధైర్యం, అంకితభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి, ఇంధన అవసరాల తీర్చడంలో సింగరేణి కార్మికులు అందిస్తున్న సేవలు అమూల్యమని కొనియాడారు.బొగ్గు కార్మికుల సమస్యలపై ఎక్కడ సమావేశం జరిగినా, ఆయా బొగ్గు సంస్థల్లో కార్మికులు ధరించే యూనిఫామ్‌ను తాను ధరించడం చాలా కాలంగా పాటిస్తున్న సంప్రదాయమని తెలిపారు. కార్మికుల శ్రమకు గౌరవం తెలిపే చిన్న ప్రయత్నంగా దీనిని భావిస్తున్నానని పేర్కొన్నారు.దేశ ఇంధన భద్రతకు నిరంతరం అండగా నిలుస్తున్న ప్రతి సింగరేణి కార్మికుడికి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి సంస్థ మరింత అభివృద్ధి సాధించి దేశ పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. చివరగా 'జై సింగరేణి.. జై తెలంగాణ అంటూ తన సందేశాన్ని ముగించారు.

# హైదరాబాద్‌లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేషనల్ లీగల్ కాంక్లేవ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

హైదరాబాద్‌లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేషనల్ లీగల్ కాంక్లేవ్

ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్, ఏఐసీసీ మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబ, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అలాగే ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఆల్ ఇండియా కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ కృష్ణ అలవేరు, కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, గురుదీప్ సింగ్, రోషిని జైశ్వాల్, శ్రావణ్ రాజ్,సుప్రియ తదితరులు కార్యక్రమంలో



పాల్గొన్నారు.దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, యువ కాంగ్రెస్ నాయకులు ఈ సదస్సుకు హాజరయ్యారు. రాజ్యాంగ పరిరక్షణ, న్యాయ వ్యవస్థ బలోపేతం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో పాటు సమకాలీన న్యాయ అంశాలపై సుదీర్ఘ చర్చ

# ఏఐసీసీ కోఆర్డినేషన్ ఇన్‌చార్జ్ గుర్దీప్ సింగ్ సప్పల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ

**హైదరాబాద్, వెలుతురు జూలై 4:**

ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కోఆర్డినేషన్ ఇన్‌చార్జ్ శ్రీ గుర్దీప్ సింగ్ సప్పల్ గారు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రసన్న కుమార్ శర్మ గారు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఏఐసీసీ–టీపీసీసీ సమన్వయం, పార్టీ అడ్మినిస్ట్రేషన్, రాష్ట్రంలో కొనసాగుతున్న పార్టీ కార్యక్రమాలు, సంఘటన్ సృజన్ అభియాన్, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై సుమారు 20 నిమిషాల పాటు ఇద్దరి మధ్య విస్తృతంగా చర్చ జరిగింది.ఏఐసీసీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి ఆదేశాలు, మార్గ దర్శకాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సమర్థ వంతంగా అమలు చేస్తున్న విషయాన్ని శ్రీ ప్రసన్న కుమార్ శర్మ గారు శ్రీ గుర్దీప్ సింగ్ సప్పల్ గారికి వివరించారు.రాష్ట్రంలో పార్టీ చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరుపై శ్రీ గుర్దీప్ సింగ్ సప్పల్ గారు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ భూమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారిని, ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రసన్న కుమార్ శర్మ గారిని అభినందించినట్లు శ్రీ ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు.



# పెద్దపల్లి జిల్లా అభివృద్ధి – ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్ రావు

**పెద్దపల్లి వెలుతురు జూలై 04:**

శనివారం రోజున పెద్దపల్లి కలెక్టరేట్‌లో జిల్లా పరిధిలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు మరింత మెరుగైన సేవలం దించేందుకు చేపట్టాల్సిన చర్యలపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ & పబ్లిక్ రిలేషన్స్) శ్రీ హార్కర వేణుగోపాల్ రావు గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్ర మాలను వేగవంతంగా, పారద ర్శకంగా అమలు చేసి ప్రజలకు సత్వర సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి గారు దిశానిర్దేశం చేశారు.అనంతరం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతన అంబులెన్స్‌ను మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్ రావు కలిసి ప్రారంభించారు. ఈ అంబులెన్స్ ద్వారా జిల్లా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత వేగంగా అందనున్నాయి.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ & పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఇతర గౌరవ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





# రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర.. బీజేపీపై మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు

- హైదరాబాద్‌లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ నేషనల్ లీగల్ కాంక్లేవ్
- రాజ్యాంగం భారత ప్రజాస్వామ్యానికి ఆత్మ అని వ్యాఖ్య
- గాంధీ, నెహ్రూ వారసత్వాన్ని మరిపించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపణ
- కుల సర్వేతో తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని వెల్లడి

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

హైదరాబాద్‌లో ఇండియన్ యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేషనల్ లీగల్ కాంక్లేవ్–2026' లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు.భారత రాజ్యాంగమే దేశ ప్రజాస్వామ్యానికి ఆత్మ అని పేర్కొన్న ఆయన, రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. గాంధీ, నెహ్రూ వారసత్వాన్ని మరిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రపంచంలోనే నెహ్రూ విజనరీ నాయకుడని, గాంధీ కుటుంబం త్యాగాలకు మారుపేరని అన్నారు.రాముడి పేరు చెప్పి ఓట్లు అడిగి బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందని, అయితే ఆ పార్టీలో రాముడికే సభ్యత్వం ఉందా అని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో ప్రజల ముందుకు వెళ్లి ఓట్లు అడిగే ధైర్యం బీజేపీ నేతలకు ఉందా అని నిలదీశారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును చోరీ చేశారని కూడా ఆరోపించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) పేరుతో కొత్త ఓట్లను చేర్చాల్సిన కార్యక్రమాన్ని, ఇప్పుడు ఓట్లను తొలగించే కార్యక్రమంగా మార్చేశారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. బీహార్, పశ్చిమ బెంగాల్‌లో



జరిగిన పరిణామాలు అందరికీ తెలుసని, బెంగాల్‌లో 90 లక్షలకు పైగా ఓట్లను తొలగించి, 30 లక్షలకు పైగా మాత్రమే కొత్త ఓట్లు చేర్చారని ఆరోపించారు.ప్రధాని నరేంద్ర మోదీ భ్రమలు వీడాలని, ఎంతటి మహారాజులైనా కాలగర్భంలో కలిసిపోయారని అన్నారు. అధికారమే పరమావధిగా మోదీ, అమిత్ షా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.భారత్ జోడో యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి రాహుల్ గాంధీ నిరంతర పోరాటం చేస్తున్నారని, ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే తెలంగాణలో వందేళ్ల తర్వాత కుల సర్వే నిర్వహించామని చెప్పారు. కుల సర్వేతో తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ మిషన్‌లో భాగస్వాములై అప్రజాస్వామిక పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని యువతకు పిలుపునిచ్చారు.పేపర్ లీకుల కారణంగా విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

# రైతు భరోసా నిధుల విడుదలలో రేవంత్ ప్రభుత్వం రికార్డు

- కేవలం 5 రోజుల్లోనే రైతు భరోసా కింద 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.77 కోట్లు జమ
- నేడు 5 నుంచి 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు రైతు భరోసా నిధుల విడుదల
- ఐదో విడతలో 1.69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.545.41 కోట్లు జమ
- ఇచ్చిన హామీ మేరకు ప్రతి అర్హ రైతుకు రైతు భరోసా అందిస్తున్నాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, వెలుతురు జూలై 4:**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రికార్డు స్థాయిలో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వం కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే రూ.7,135.77 కోట్లను 67.45 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసి మరో రికార్డు సృష్టించిందన్నారు.నేడు రైతు భరోసా పథకం ఐదో విడతలో 5 నుంచి 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు రూ.545.41 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 1.69 లక్షల మంది రైతులు రైతు భరోసా సాయం పొందారని తెలిపారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇప్పటికే తొలి నాలుగు విడతలలో 4 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేశామని, నేడు 5 నుంచి 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులందరికీ సాయం అందించామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.77 కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు మంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఆదర్శ రాజకీయ నాయకుడు కొణిజేటి రోశయ్య: మంత్రి వివేక్ వెంకటస్వామి




- తెలంగాణ ఉద్యమ సమయంలోనూ విలువైన సలహాలు ఇచ్చారు

**హైదరాబాద్, వెలుతురు జూలై 4:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య గారు నేటి తరానికి ఆదర్శప్రాయుడైన రాజకీయ నాయకుడని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీలు మరియు గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారు కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన రోశయ్య 93వ జయంతి సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామి గారు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోశయ్య గారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రోశయ్య గారు ప్రతిపక్ష నేతగా అత్యంత కీలక పాత్ర పోషించారు.

బడ్జెట్ ప్రతిపాదనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేవారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని ఆర్థికంగా ఎలా ముందుకు తీసుకెళ్లాలో ప్రభుత్వానికి విలువైన సలహాలు ఇచ్చేవారు" అని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రిగా రాష్ట్ర ప్రాధాన్యతలు, సంక్షేమం, అభివృద్ధిపై ఆయనకు స్పష్టమైన దార్శనికత ఉండేదన్నారు.తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో పొన్నం ప్రభాకర్, తాను తెలంగాణ కోసం పోరాడుతుంటే, రోశయ్య గారు ఎంతో హుందాగా సలహాలు ఇచ్చేవారని మంత్రి గుర్తుచేసుకున్నారు. "తెలంగాణ కోసం కొట్లాడండి.. కానీ రెండు ప్రాంతాలకూ న్యాయం జరిగేలా ఆలోచించాలని చెప్పేవారు" అన్నారు. జైపూర్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవ సమయంలో తీవ్ర నిరసనలు వ్యక్తమైనప్పటికీ.. 'ఇది అభివృద్ధి కార్యక్రమం, ఎవరికీ వ్యతిరేకం కాదు' అని ఫోన్ చేసి మరీ చెప్పి, కార్యక్రమానికి హాజరై అందరినీ అభినందించిన గొప్ప సంస్కారం ఆయనదని కొనియాడారు.పరిపాలనలో రోశయ్య గారు సరికొత్త ప్రమాణాలు నెలకొల్పారని మంత్రి వివేక్ అన్నారు. రాత్రి వేళల్లోనూ సెక్రటేరియట్‌లో కూర్చుని ఫైళ్లను క్లియర్ చేసిన ఏకైక ముఖ్యమంత్రి రోశయ్య గారేనని కొనియాడారు. ఎప్పుడూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా.. ఫైలును పూర్తిగా చదివి, ఏది రైటు, ఏది రాంగు, దీనివల్ల ప్రజలకు మేలు జరుగుతుందా లేదా అని ఆలోచించిన తర్వాతే సంతకం చేసేవారని గుర్తుచేశారు.రోశయ్య గారితో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని అన్నారు.

"మా నాన్నగారితో రోశయ్య గారికి ఎంతో సన్నిహిత సంబంధం ఉండేది. ఒక ముఖ్యమంత్రిగానో, మంత్రిగానో కాకుండా.. నన్ను, వినోద్ గారిని ఎంతో ఆప్యాయంగా చూసేవారు. నాన్నగారిపై చూపించిన ప్రేమనే మాపైనా కురిపించారు. ఆయన చూపిన ప్రేమాభిమానాలకు మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులం" అని అన్నారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు, రోశయ్య గారి కుటుంబ సభ్యులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు, ప్రముఖులు, సాంస్కృతిక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి రోశయ్య కి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళులు..

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ రోశయ్య గారి 93వ జయంతి సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఘనంగా నివాళులు అర్పించారు.గాంధీభవన్ లో జరిగిన రోశయ్య జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.. రోశయ్య లాంటి క్రమశిక్షణ గల నాయకులు అరుదుగా ఉంటారని ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కట్టుబడి ఉన్నారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రి గా ఆయన సేవలను తెలుగు ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరని అన్నారు.ఆయన క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావమే ఆయనను అంత గొప్ప నాయకుడికి చేసిందని అన్నారు. ఆయన ఎంత పెద్ద పదవిలో ఉన్న కూడా అతి సాధారణ జీవితాన్ని గడిపారని ఆయన రాజకీయాలు, ఆయన ఆచరించిన సిద్ధాంతలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు.. అనంతరం గాంధీ భవన్.లో జరిగిన కార్యక్రమంలో ఆయన రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.



# పరిమళించే జీవితం... పరిశీలనా దృష్టితోనే!

మనం అనుదినం నయనోల్లాసకరమైన, వైవిధ్యభరితమైన వేలాది దృశ్యాలను వీక్షిస్తుంటాం. పూర్వాహ్న వేళ భానుడి అరుణ కిరణాల కాంతిపుంజాలు, జనసమ్మర్ధంతో కిటకిటలాడే నగర వీధులు, నవపల్లవాల మందమారుత చలనం, మృత్తికను తాకిన తొలి వర్షపు బిందువుల సువాసనలు ఇవన్నీ మానవ చైతన్య స్రవంతిలో నిరంతరం భాగమవుతూనే ఉన్నాయి. అయితే, ఈ దృశ్య మాలికలలో ఎన్నింటిని మనం అంతఃకరణతో ఆస్వాదిస్తున్నాం? బాహ్య చక్షువులతో కేవలం వీక్షించడం వేరు, హృదయ సంకల్పంతో లోతుగా పరిశీలించడం వేరు. ఈ సూక్ష్మ గమనికే జగత్తులోని నిగూఢ సౌందర్యాన్ని ఆవిష్కరించే అద్భుతమైన కళ. విశ్వంలో సమ్మోహన సౌందర్యం అనేది ఎక్కడో సుదూర తీరాలలో, అరుదైన క్షణాలలో నిక్షిప్తమై లేదు, అది మానవ నిత్య జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనల అంతర్గత పొరల్లోనే దాగి ఉంది. దాన్ని పసిగట్టే శోధనా దృష్టి, సునిశిత పరిశీలన మన అలవాటుగా మారితే చాలు.

భౌతిక పరిభాషలో గమనిక అంటే కేవలం ఒక వస్తువుపై దృష్టి సారించడం కాదు. అది మానసిక పరిణితికి, ప్రశాంతతకు నిదర్శనం. ఆధునిక కాలంలో యాంత్రిక జీవన శైలికి అలవాటుపడిన సగటు మానవుడు తీవ్రమైన ఒత్తిడి, తొందరపాటుతో కాలం గడుపుతున్నాడు. ఈ క్రమంలో నిదానంగా, శ్రద్ధగా ఒక వృత్తాంతాన్ని పరిశోధించే నైజం క్రమంగా క్షీణిస్తోంది. వృత్తిపరమైన బాధ్యతల నిర్వహణలో, కార్యాచరణ వేగంలో ఆకాశంలో మేఘమాలికల విన్యాసాలను తిలకించే వ్యవధి లభించడం లేదు. అమాయక బాలల నవ్వులలోని పవిత్రతను, నిష్కల్మషత్వాన్ని తనివితీరా ఆస్వాదించే ఓపిక నశిస్తోంది.కానీ, ఏ కొద్దిమంది అయితే ఈ లఘు పరిణామాలను నిశితంగా పరిశీలిస్తారో, వారికి ఈ సృష్టి రంగులమయంగా, అత్యంత సార్ధకంగా భాసించడం ఖాయం. మన ప్రాచీన కవులు, దార్శనిక తత్వవేత్తలు ఈ సత్యాన్ని శతాబ్దాల క్రితమే ప్రవచించారు. వారు ప్రాకృతిక సమస్త జీవకోటిని లోతుగా అధ్యయనం చేసి, ఆ వైభవాన్ని అక్షర రూపంలో కవితా సంపుటాలుగా మలిచారు. ఒక కుసుమం వికసించే క్రమం, ఒక నది ప్రవహించే లయబద్ధ వేగం, విహంగాలు గగన తలంలో విహరించే శైలి వీటన్నింటి వెనుక ఉన్న అనంత సౌందర్యాన్ని వారు కావ్యీకరించారు. ఇది వారికి ఉన్న ఏదో దైవిక శక్తి వల్ల సాధ్యం కాలేదు, కేవలం సృష్టిని సమగ్రంగా గమనించే గుణం వల్లనే సాధ్యపడింది.



మనం బాహ్యంగా చూసే శారీరక రూపం, విలాసవంతమైన భోగభాగ్యాలు లేదా పర్యాటక స్థలాలు మాత్రమే సౌందర్యానికి ప్రతీకలు కావు. పండు ముసలిది తన మనవడికి అనురాగంతో కథలు చెబుతున్న వేళ ఆ వాతావరణంలో అద్భుతమైన సౌందర్యం ప్రతిబింబిస్తుంది. శ్రమజీవి అయిన రైతు శరదృతువులో పంట పొలాల్లో విత్తనాలు నాటుతూ, ఉజ్వల భవిష్యత్తుపై ఆశావహ దృక్పథంతో చెమటోడ్చే శ్రమ సౌందర్యంలో ఒక మహత్తర కావ్యం దాగి ఉంది. ఒక మాతృమూర్తి తన బిడ్డకు తనివితీరా అన్నం తినిపిస్తూ కురిపించే వాత్సల్య పూరిత ప్రేమలో అనిర్వచనీయమైన దైవత్వం సాక్షాత్కరిస్తుంది.ఈ సంఘటనలన్నింటినీ మనం సమాజంలో నిత్యం చూస్తూనే ఉన్నప్పటికీ, వాటి అంతరార్థాన్ని, ఆత్మీయ భావోద్వేగాలను హృదయపూర్వకంగా ఆకళింపు చేసుకోలేకపోతున్నాం. ఒక సాధారణ పౌరుడు తన దైనందిన జీవన యానంలో ఎదురయ్యే ఆటంకాలను, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ, ముఖంపై చిరునవ్వు చెదరనీయకుండా ప్రయాణించే ధైర్యంలోనే నిజమైన అందం ఉంది. విపత్కర పరిస్థితుల్లో సైతం ఆత్మవిశ్వాసం కోల్పోకుండా జీవన పోరాటం సాగించే వ్యక్తుల గాథలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయి. బాహ్య చక్షువులకు గోచరించే నశ్వరమైన అందం కంటే, అంతరాత్మను కదిలించే ఈ నిరంతర ఆంతరంగిక సౌందర్యమే శాశ్వతమైనది మరియు అమూల్యమైనది.ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారులు, సాహితీవేత్తలు, ఛాయాచిత్రకారులు (ఫోటోగ్రాఫర్స్) తమ సృజనాత్మకతతో చేసే అద్భుతం ఒక్కటే వారు సమాజంలోని అతి సాధారణ అంశాలను అసాధారణ కోణంలో ఆవిష్కరిస్తారు. ఒక నిపుణుడైన ఫోటోగ్రాఫర్ వీధి పక్కన రాలిన ఎండిన ఆకును చూసినప్పుడు, దానిపై పడే కాంతి నీడల సమతుల్యతను, రంగుల వైవిధ్యాన్ని గమనించి తన కెమెరాలో బంధిస్తాడు.

అదే మార్గంలో వెళ్లే వేరొక సాధారణ బాటసారి దానిని నిరుపయోగమైన వ్యర్థంగా భావించి కాలితో తొక్కుకుంటూ వెళ్ళిపోతాడు. ఇక్కడ స్పష్టమైన వ్యత్యాసం కేవలం చూసే దృష్టి లోనే ఉంది.ఈ విశిష్ట దృక్పథాన్ని అలవరచుకోవడమే జీవితంలో అసలైన సౌందర్యాన్ని ఆస్వాదించే కళను నేర్చుకోవడం. దీనికోసం ఎటువంటి ప్రాకృతిక శిక్షణాలయాలకు వెళ్ళనవసరం లేదు. మనకు కావలసింది కేవలం మానసిక ప్రశాంతత, నిదానం మాత్రమే. ఆధునిక వేగవంతమైన జీవన గమనాన్ని కాస్త మందగించి, ప్రతి అనుభూతిని హృదయానికి హత్తుకోవాలి. భోజనం చేసేటప్పుడు ఆహార రుచిని ఆస్వాదించడం, తోటివారితో సంభాషించేటప్పుడు వారి మాటలను సహనంతో ఆలకించడం, నడుస్తున్నప్పుడు చుట్టూ ఉన్న పర్యావరణాన్ని ప్రేమించడం ఇవన్నీ కూడా ఈ ఉన్నతమైన జీవన కళలో అంతర్భాగాలే.భారతీయ సనాతన తత్వశాస్త్రంలో ధ్యాన ప్రక్రియకు అత్యున్నత ప్రాధాన్యత ఉంది. చిత్తవృత్తి నిరోధమే ధ్యానం అని పెద్దలు చెబుతారు.

ఈ ఏకాగ్రతను, మానసిక శక్తిని లౌకిక జీవితంలో నిగూఢంగా ఉన్న సౌందర్యాన్ని శోధించడానికి వినియోగించవచ్చు. మనం ఏదేని ఒక వస్తువును లేదా అంశాన్ని సంపూర్ణ శ్రద్ధతో పరిశీలించినప్పుడు, అది మనకు నూతన ఆవిష్కరణలను అందిస్తుంది. ఉదాహరణకు, ఒక సాధారణ పుష్పాన్ని కొద్ది నిమిషాల పాటు ఏకాగ్రతతో గమనిస్తే, దాని రేకుల అద్భుత నిర్మాణం, ప్రకృతి ప్రసాదించిన వర్ణ వైవిధ్యం, దాని సుగంధ పరిమళాలు మనకు సరికొత్త అనుభూతిని ఇస్తాయి.

ప్రకృతి అనేది ఒక అనంతమైన కాన్వాస్ లాంటిది. కాలచక్రం తిరుగుతున్న కొద్దీ ప్రతిరోజూ దానిపై సరికొత్త రమణీయ చిత్రాలు రూపుదిద్దుకుంటాయి. అయితే ఆ సృష్టి నైపుణ్యాన్ని వీక్షించే జ్ఞాన చక్షువులు మానవాళికి అత్యంత ఆవశ్యకం. ఈ కళ్ళను తెరవడమే ఆధ్యాత్మిక, భౌతిక సాధన. కేవలం సంపద, సామాజిక హోదా, కీర్తి ప్రతిష్టల కోసం అహోరాత్రులు శ్రమిస్తూ, పరుగులిడే ఈ యాంత్రిక ప్రపంచంలో, ఒక్క క్షణం ఆగి చుట్టూ ఉన్న నిశ్శబ్ద సౌందర్యాన్ని అనుభవించే సహృదయులు అరుదుగా కనిపిస్తారు. కానీ, అలాంటి ఆత్మానందం పొందే వ్యక్తులే జీవితంలో పరిపూర్ణ సంతృప్తిని, మానసిక శాంతిని సాధించగలరనేది జగమెరిగిన సత్యం.సౌందర్యం అనేది కేవలం బాహ్య ప్రపంచంలో, భౌతిక వస్తువులలో మాత్రమే ప్రతిష్ఠితమై లేదు; అది చూసే వ్యక్తి యొక్క అంతర్గత దృక్పథంపై ఆధారపడి ఉంటుంది. ఒకే సంఘటనను ఇద్దరు వ్యక్తులు పూర్తిగా భిన్నమైన కోణాల్లో దర్శించగలరు. ఒకరికి అది అత్యంత సామాన్యమైనదిగా అనిపిస్తే, మరొకరికి అది ఒక అద్భుత సృష్టిగా గోచరిస్తుంది.

ఈ వైరుధ్యానికి ఏకైక కారణం వారి గమనించే సామర్థ్యంలోని తారతమ్యమే.

కాబట్టి, మనం సౌందర్య ఆస్వాదన కోసం సుదూర తీరాలకు లేదా విదేశీ పర్యాటక ప్రాంతాలకు వెళ్ళనక్కరలేదు. మన గృహ సమూహాల కిటికీల గుండా కనిపించే అనంతమైన నీలాకాశంలో, కన్నవారి నిర్మలమైన నవ్వులలో, అనుదిన జీవితంలోని ప్రతి లఘు క్షణంలోనూ ఆనందం, అందం నిక్షిప్తమై ఉన్నాయి. ఈ నిగూఢ సత్యాన్ని గుర్తించే కళను గనుక మనం నిరంతర సాధన ద్వారా పెంపొందించుకుంటే, మానవ జీవితం మరింత సుసంపన్నంగా, పరమార్థభరితంగా మారుతుంది. అంతిమంగా, జీవన గమనికలోనే జగత్తు సౌందర్యం ఇమిడి ఉందనే పరమ సత్యాన్ని గ్రహించిన నాడు, ప్రతి నిత్యం ఒక నూతన ఉత్సవంగా, ఒక పండగగా భాసిస్తుంది.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# 'డిజిటల్ ఇండియా' పదకొండేళ్ల ప్రస్థానం పౌరులకు.. వ్యాపారాలకు సౌలభ్యం

ఓ పదేళ్ల కిందట వ్యవసాయ సబ్సిడీ కోసం లేదా దిగుబడి పెంచే సలహాల కోరడానికి ఉత్తరప్రదేశ్‌లోని ఒక మారుమూల గ్రామ రైతు ఎన్నో రకాల భౌతిక దరఖాస్తులు, విజ్ఞప్తులతో సతమతమయ్యే దుస్థితి ఉండేది. నిత్యం ఏదో ఒక తెగబారెడు వరుసలో నిలువు కాళ్ల బేరం తప్పేది కాదు. అయితే, ఇవాళ అదే రైతు తాను ఉన్న చోట నుంచే పంటకు మద్దతు ధర పొందుతున్నాడు. దళారుల బెడద లేకుండా రాయితీలు నేరుగా అతని బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయి.మీరిప్పుడు ఏ వీధిలో నడిచినా మరో నిశ్శబ్ద విప్లవం కూడా కళ్లకు కడుతుంది. అది ప్రాథమికంగా జీవన సౌలభ్యాన్ని పునర్నిర్వచించింది. ఒకనాడు పూర్తి నగదు లావాదేవీలపై ఆధారపడిన స్థానిక పండ్ల వ్యాపారి లేదా ఆటో వాలా నేడు తన బండికి లేదా ఆటోలో అమర్చిన 'క్యూఆర్' కోడ్‌ను సగర్వంగా చూపుతూ చెల్లించమంటాడు.మొత్తం మీద నేటి భారతం 102.86 కోట్ల మంది అనుసంధానిత పౌరులతో శక్తిమంతంగా ముందుకు సాగుతోంది. వీరందరికీ 99.56 కోట్ల మంది బ్రాడ్‌బ్యాండ్ చందాదారుల భారీ తోడ్పాటు లభిస్తోంది. మొబైల్ డేటా ధర జీబీకి ₹8 నుంచి ₹10 వరకు అత్యంత చౌకగా మారడంతో నెలవారీ వ్యక్తిగత డేటా వినియోగం అసాధారణ స్థాయిలో 24.01 జీబీకి పెరిగింది. విశ్వాసం, పారదర్శకత, డిజిటల్ స్వయం ప్రతిపత్తి ప్రాతిపదికగా అనుసంధానాన్ని నిలబెడుతున్న ఈ డిజిటల్ పునాది, పౌరులు-ప్రభుత్వం మధ్య సంబంధాన్ని కూడా పూర్తిగా పునర్నిర్వచిస్తోంది.ముఖ్యంగా గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వాన సాంకేతిక పరిజ్ఞానం పౌరులకు జీవన సౌలభ్యంతోపాటు వ్యాపార సౌలభ్యం కల్పిస్తూ ఒక ప్రజాస్వామ్య సమానత్వ సాధనంగా ఉపయోగపడతుందని డిజిటల్ ఇండియా రుజువు చేసింది.అంతరాల తొలగింపు అందరికీ అందుబాటు, సాంకేతిక స్వావలంబనకు హామీ ఇచ్చే పటిష్ట, స్వదేశీ డిజిటల్ గుర్తింపు వ్యవస్థను రూపొందించడం ఈ విప్లవంలో తొలి అడుగు. అటుపైన భారత్‌నెట్ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో అమలు చేయడం ద్వారా దాదాపు 2.2 లక్షల పంచాయతీలను హై స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్‌తో విజయవంతంగా అనుసంధానించారు. తద్వారా ఆర్థిక అవకాశాలకు భౌగోళిక దూరం ఇకపై ఎంతమాత్రం అవరోధం కాదని భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా 144 కోట్లకు పైగా ఆధార్ గుర్తింపు జారీ సహా జన్‌ధన్, ఆధార్, మొబైల్ (జామ్) త్రయానికి శక్తినిచ్చింది ఈ మౌలిక సదుపాయాల పురోగమనమే. ఈ సార్వభౌమ డిజిటల్ గుర్తింపు వ్యవస్థ ఒక ఉపకరణంగా ప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా ₹51.5 లక్షల కోట్లను నేరుగా పౌరుల ఖాతాలకు విజయవంతంగా బదిలీ చేసింది. లక్షలాది కుటుంబాల చేతిలోకి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని నేరుగా బదిలీ చేయడం ద్వారా అవినీతిని సమర్థంగా అరికట్టి, దళారుల పీడ వదిలించి, జీవన సౌలభ్యాన్ని గణనీయంగా మెరుగుపరిచింది ఈ వ్యవస్థ.

డీపీఐ ఒక అద్భుతం: దైనందిన జీవనం.. వ్యాపార రంగం రూపాంతరీకరణ

పునాది సిద్ధమయ్యాక వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారం ద్వారా భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలు (డీపీఐ) పౌరుల దైనందిన జీవితాలను ఆమూలాగ్రం మార్చివేశాయి. పౌరులు, వ్యాపారాల సౌలభ్యం కోసం వివిధ ప్రక్రియలను డిజిలాకర్ వంటి వేదికలు ఆసాంతం సరళీకరించాయి. ఈ మేరకు 70 కోట్లకు పైగా నమోదిత వినియోగదారులు, 900 కోట్లకు పైగా పత్రాలతో ఇది భౌతిక పత్రాల సమర్పణ అవాంతరాలను తొలగించింది. అలాగే, కేవైసీ ప్రక్రియలను, పత్రాల ధ్రువీకరణను తక్షణం సాధ్యమయ్యేలా చేసింది. సంస్థల విషయానికొస్తే- ఇది అమలు వ్యయంతోపాటు సమయాన్ని కూడా స్పష్టంగా తగ్గించింది. బ్యాంకులు, టెలికాం ఆపరేటర్లు, సాంకేతికార్థిక సంస్థలు నేడు ఒక వినియోగదారుకు రోజుల్లో కాకుండా కేవలం సెకన్లలోనే సేవా ప్రదానం చేస్తున్నాయి.

మరోవైపు తన 'ఇ-మార్కెట్ ప్లేస్' (జీఈఎం) ద్వారా ప్రభుత్వం ₹19.51 లక్షల కోట్లకు పైగా విలువైన కొనుగోళ్లు చేసింది. ఒక చిన్న తయారీదారు లేదా తొలిసారి వ్యాపారంలో ప్రవేశించిన వ్యక్తి దళారుల వలయాన్ని ఛేదించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ కాంట్రాక్టులు పొందే వ్యాపారావకాశం కల్పించింది.

ప్రభుత్వ సేవలను ఏ మూలనుంచయినా పొందడానికి వీలుగా ఉమంగ్ అనువర్తనం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సేవలను నేరుగా పౌరుల అరచేతిలో పెట్టింది. ఇదిప్పుడు 11.6 కోట్లకు పైగా నమోదిత వినియోగదారులకు సేవలందిస్తోంది. వీరికి 2,572 ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెస్తూ ఇప్పటిదాకా 797.84 కోట్ల లావాదేవీల సౌలభ్యం కల్పించింది.

ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ) దీనికంతటికీ తలమానికం వీధి పక్కన పండ్లు, పూలు అమ్మే వ్యక్తికి కూడా 'క్యూఆర్' కోడ్ శక్తినిచ్చింది ఈ సర్వస్వతంత్ర చెల్లింపుల వ్యవస్థే. ఇది నేడు ఏకంగా 75 కోట్ల లావాదేవీలను నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్త ప్రత్యక్ష డిజిటల్ చెల్లింపులలో దాదాపు సగం భారత్‌లోనే నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో యూపీఐని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రత్యక్ష చెల్లింపుల వ్యవస్థగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) గుర్తించింది.

ఈ డిజిటల్ పాలన వేదికలను అనుకరణ లేదా అమలు దిశగా 24 దేశాలతో భారత్ అధికారిక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇప్పుడు ఆయా దేశాలకు ఈ వ్యవస్థ ఒక అనివార్య ఆసరాగా మారింది. మరోవైపు యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్ సహా 9 దేశాలలో మన యూపీఐ అందుబాటులోకి వచ్చింది.

సాంకేతికతను ఒక ప్రజాహితంగా పరిగణించే ఈ తత్వం, జీవన సౌలభ్యాన్ని కల్పించే ఆరోగ్య సమానత్వం దిశగానూ నేరుగా విస్తరిస్తుంది. 'ఇ-సంజీవని' వేదిక ద్వారా 48 కోట్లకు పైగా ఉచిత దూర-సంప్రదింపులకు భారత్ వీలు కల్పించింది. దీంతో మారుమూల గల, సేవలు సరిగా అందని ప్రాంతాల్లోని రోగులు కూడా నిపుణుల సలహాలు పొందగలుగుతున్నారు. అదేవిధంగా ప్రపంచంలోనే అతి పెద్ద టీకాల కార్యక్రమం కూడా ఒక స్వదేశీ వేదిక ద్వారానే కొనసాగింది. ఈ మేరకు 'కోవిన్' అనువర్తనం ద్వారా 220 కోట్లకు పైగా కోవిడ్-19 వ్యాక్సిన్ డోసులను పారదర్శకంగా వేయడంతోపాటు పర్యవేక్షించారు. ఇది ఒక పటిష్ట డిజిటల్ మౌలిక సదుపాయాన్ని కల్పించిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్త ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలన్నీ దీనిపై అధ్యయనం చేశాయి.

భవిష్యత్తు వైపు దృష్టి

'డిజిటల్ ఇండియా' కార్యక్రమానికి ఇప్పుడు పదకొండేళ్లు నిండుతున్న తరుణంలో మరింత అత్యాధునిక సాంకేతికతల దిశగా ఇది నిశితంగా దృష్టి సారిస్తోంది. భారత్ సహా వర్ధమాన దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారంలో ఈ సాంకేతికతలను ప్రజాహితం ప్రధానంగా వినియోగించుకునేందుకు భరోసా ఇస్తోంది.

కంప్యూటింగ్ సామర్థ్యం సముపార్జనకు అధిక వ్యయం ఫలితంగా చిన్న పట్టణాల్లోని ప్రతిభావంతులు, యువ ఆవిష్కర్తలు ఆధునిక సాంకేతికతలకు దూరంగా ఉండాల్సిన దుస్థితి ఇన్నాళ్లూ రాజ్యమేలింది. ఈ పరిస్థితిని చక్కదిద్దే క్రమంలో ఇండియాఏఐ మిషన్ కింద అంకుర సంస్థలకు వ్యాపార సౌలభ్యం మెరుగుపరచే దిశగా భారత్ ఇలాంటి అడ్డంకులను తొలగిస్తోంది. అందరికీ అందుబాటు కోసం ఒక భారీ, ఉమ్మడి కంప్యూట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. స్వదేశీ అంకుర సంస్థలకు, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి కంప్యూటింగ్ సామర్థ్య శిక్షణను గంటకు కేవలం ₹65కే అందిస్తోంది. క్షేత్రస్థాయిలో ఆవిష్కరణలను ప్రోత్సహించడమే దీని లక్ష్యం. ప్రతిభావంతులైన మన శ్రామికశక్తితో దేశీయంగానే కాకుండా విదేశాల్లోనూ అన్ని రంగాల సంస్థలలో సేవా ప్రదానాన్ని రూపాంతరీకరించనుంది. ఉత్పాదకత పెంపు ద్వారా భారత్‌ను ప్రపంచ ఏఐ అనువర్తనాల రాజధానిగా మార్చడమే లక్ష్యంగా ముందడుగు వేస్తోంది.

అంతేకాకుండా భారత్ తన హార్డ్‌వేర్ భవిష్యత్తును కూడా సురక్షితం చేసుకుంటోంది. సెమీకాన్ ఇండియా కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా ₹1.65 లక్షల కోట్ల పెట్టుబడితో 12 సెమీకండక్టర్ తయారీ, ప్యాకేజింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ ఉత్తేజం కొనసాగింపులో భాగంగా కేంద్ర బడ్జెట్ 2026-27లో ప్రభుత్వం 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) 2.0'ను ప్రకటించింది. తయారీ రంగానికి అతీతంగా సెమీకండక్టర్ పరికరాలు, ముడి పదార్థాలపై ఇది నిశితంగా దృష్టి సారిస్తుంది. అలాగే, పూర్తిస్థాయిలో భారతీయ మేధా సంపత్తికి రూపమిస్తూ ప్రపంచ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. దీనికింద ఇప్పటికే 24 సెమీకండక్టర్ డిజైన్ అంకర సంస్థలకు ఆమోద ముద్ర వేయడం ద్వారా భారత్ తన సామర్థ్య సృష్టిని సత్వర లోతైన సాంకేతిక పరిజ్ఞానంగా మారుస్తోంది. ఆధునిక ప్రపంచానికి శక్తినిచ్చే చిప్‌ల తయారీలో శక్తిమంతమైన దేశీయ 'ఫ్యాబ్‌లెస్' వాతావరణ వ్యవస్థను పెంపొందిస్తోంది.

వాస్తవ వారసత్వం, ఆవిష్కరణలు, నిరంతరాయ వ్యాపార కార్యకలాపాలు, పరిపాలన తమ వేలి కొసల్లోకి రావాలని దేశ యువతరం ఆకాంక్షించే దిశగా ఈ కార్యక్రమం పెనుమార్పులు తెచ్చింది. సాంకేతికతను సార్వజనీనతతో జోడిస్తూ, సౌలభ్యాన్ని స్వతంత్ర శక్తికి సాధనంగా మలచడం ద్వారా 2047 నాటికి మనం కలలుగంటున్న వికసిత భారత్ వైపు ప్రస్థానానికి డిజిటల్ ఇండియా నిశ్శబ్దంగా సారథ్యం వహిస్తోంది.



శ్రీ ఎస్. కృష్ణన్
(వ్యాసకర్త కేంద్ర ఎలక్ట్రానిక్స్
- సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖ కార్యదర్శి)

# మంచాల మండలం వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఆరుట్ల గ్రామంలో కూర గా యల మార్కెట్ ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే
- గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం
- పాలన కొనసా గిస్తుంది ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి


ఆరుట్ల గ్రామంలో కూరగాయలు అమ్ముకుంటున్న మహిళా రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి


ఆరుట్ల గ్రామంలో కూరగాయల మార్కెట్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**మంచాల వెలుతురు జూలై 04:**

మంచాల మండలం వివిధ గ్రామాల్లో పర్యటించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారికి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికి శాలువలతో ఘనంగా సన్మానిం చారు అనంతరం నోముల గ్రామంలోని సహకార సంఘం భవనంలో ఏర్పాటుచేసిన ఎరువుల పంపిణీ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు మంచాల మండల కేంద్రంలో రైతులకు బోర్లమోటార్లు పంపిణీ చేశారు ఆరుట్ల గ్రామంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం వారి ఆధ్వర్యంలో ని ర్మించిన కూరగాయల మార్కెట్ ను ప్రారంభోత్సవం రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసు కున్నారుఆరుట్ల గ్రామంలో సిసి.రోడ్ల నిర్మాణానికి శంకుస్థా పనలు చేశారు బోడకొండ గ్రామంలో స హకార సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎరువుల పంపిణీ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చే శారు రంగాపూర్ బాలికల గురుకుల వసతి గృహంలో తరగతి గదులు శంకుస్థాపన ఎల్లమ్మతం డా ఆంబోతుతండా లోయపల్లి గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థా పనలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ని యోజకవర్గంలోని అన్ని గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోప్రభుత్వంపాలన కొనసాగిస్తుంది అని అన్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అన్నిమౌలిక వసతు లతో అభివృద్ధి చేస్తాను అని అన్నారు ఈకా ర్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సీనియర్ నాయకుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈసీ శేఖర్ గౌడ్ మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి కాం గ్రెస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి మంచాల మాజీ ఎంపీపీ రాష్ట్ర మ హిళా కాంగ్రెస్ కార్యదర్శి గుండెమోని జయమ్మ మల్లేష్ ముదిరాజ్ నోముల మాజీ ఎంపీటీసీ జ యనాదం మంచాల గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శో భా కుమార్ మంచాల సొసైటీ డైరెక్టర్లు జెనిగే వెంకటేష్ వింజమూరి రాంరెడ్డి పంది రమేష్ యాద య్య సత్యనారాయణ వేణుగోపాల్ రావు ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరిఎల్లేష్ కొర్రపాండు నాయక్ మాజీ సర్పంచ్ లు సుంకరి పండరీనాథ్ గౌడ్ ఆనంగల్ల యాదయ్య మిద్దె శ్రీ నివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లాఅ ధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి మంచాల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల రాఘవ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బా లరాజ్ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం నోముల గ్రామశాఖ అధ్యక్షుడు పల్లాటి రవి మంచాల గ్రామశాఖ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ లోయపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు మాధగోని శి వశంకర్ గౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వంగవీటి మోహన్ రంగా ఆశయాలు చిరస్మరణీయం.. జనసేన నాయకుడు ప్రేమ్‌కుమార్



**కూకట్ పల్లి జూలై 04 వెలుతురు:**

వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ హౌసింగ్ బోర్డు టెంపుల్ బస్‌స్టాప్ సమీపంలో కూకట్ పల్లి కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ హాజరై వంగవీటి మోహన్ రంగ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం కోసం రంగా చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు స్వయంగా అన్న వితరణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వంగవీటి మోహన్ రంగా అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగా చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## ఘనంగా ఉప్పల ఏకాంత్ గౌడ్ జన్మదిన వేడుకలు..

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'టీమ్ ఏకాంత్' ఆధ్వర్యంలో అన్నదానం.



**కూకట్ పల్లి, జూలై 4 (వెలుతురు):**

శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పల ఏకాంత్ గౌడ్ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్ లాల్ బహదూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 'టీమ్ ఏకాంత్' ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీమ్ ఏకాంత్ సభ్యులు స్వయంగా పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని వడ్డించారు. నాయకుడి జన్మదినాన్ని ఆర్భాటాలకు దూరంగా, విద్యార్థుల మధ్య సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానికులు కొనియాడారు. ఈ సందర్భంగా ఉప్పల ఏకాంత్ గౌడ్ ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమాజ సేవకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు వెల్లడించారు.



## గీతాంజలి పాఠశాలలో ఘనంగా వన మహోత్సవం..

- పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల అవగాహన ర్యాలీ




**కూకట్ పల్లి జూలై 04 వెలుతురు:**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశాన్ని విస్తృతంగా చాటిచెప్పే లక్ష్యంతో కూకట్ పల్లి వివేకానంద నగర్ గీతాంజలి పాఠశాలలో వన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు "చెట్లు నాటుదాం – ప్రకృతిని కాపాడుదాం", "ఒక్క మొక్క – ఒక జీవం" వంటి నినాదాలతో పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకోగా, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పర్యావరణంపై అవగాహన, ప్రకృతి పట్ల ప్రేమ, సామాజిక బాధ్యత పెంపొందించడమే వన మహోత్సవం నిర్వహణ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వన మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో నూతన బోర్‌వెల్ మోటర్ ప్రారంభం




**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 04:**

బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బోర్‌వెల్ మోటర్ ఏర్పాటు చేశారు.గతవారం కాలనీవాసులు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన కోలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి, కాలనీలో ఉన్న ఐదు బోర్‌వెల్ ఫ్రెస్సింగ్ అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్త మోటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన సూచనల మేరకు అధికారులు వెంటనే స్పందించి, శనివారం నూతన బోర్‌వెల్ మోటర్‌ను కాలనీకి అందించి ఏర్పాటు కార్యక్రమాన్ని 295 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ గౌడ్, 19వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి, సీనియర్ నాయకులు నర్సారెడ్డి, బాల్‌రెడ్డి కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ కన్వీనర్ సాల్మన్ రాజ్, ఎస్సీసెల్ అధ్యక్షులు సురేష్, పోచి మహేష్, ఫిషర్మెన్ ప్రెసిడెంట్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దయానంద్, మహిళా నాయకులు హేమలత, కమలమ్మ, రజియా, సోమరాజు, వెంకటేష్, రాజు, బాలరాజు, శ్రీనివాసు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తన్నీరు శ్రీనివాస్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 04:**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యూజేఎఫ్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ కు చెందిన తన్నీరు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శనివారం నగరంలోని అంబర్ పేటలోని అలీ కేఫ్ చౌరస్తా పద్మావతి డీపీ రెడ్డి హాల్ (కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్)లో జరిగిన టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి ఫెడరేషన్ రాష్ట్ర కో–కన్వీనర్లు, మాజీ ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫెడరేషన్ పరిస్థితి– పరిణామాలపై చర్చించారు. అదే విధంగా జిల్లా కోర్టు, హైకోర్టులలో నడుస్తున్న కేసుల వివరాలు–వాటి పరిస్థితిపై విశ్లేషించారు. దీంతోపాటు జిల్లాలలో సభ్యత్వ నమోదు, జిల్లాల మహాసభల నిర్వహణపై చర్చించారు. జిల్లా మహాసభల అనంతరం రాష్ట్ర మహాసభలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తన్నీరు శ్రీనివాసును రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

**అంచలంచలుగా ఎదిగిన తన్నీరు శ్రీనివాస్**

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ కు చెందిన తన్నీరు శ్రీనివాస్ జర్నలిస్ట్ నాయకులుగా అంచలంచలుగా ఎదిగారు. ఫెడరేషన్ లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులుగా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తన్నీరు శ్రీనివాసును రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా



ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా శాఖలు హర్షం వ్యక్తం చేశాయి. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని పలువురు జర్నలిస్టులో ఆకాంక్షించారు. నిత్యం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పరితపించే శ్రీనివాస్ కు సముచిత స్థానం కల్పించారన్నారు. ఈసందర్భంగా తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, నేషనల్ కౌన్సిల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం మరింత చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



- తపస్ తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 03:**

ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలోపెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయవిసమస్యలు పరిష్కరించా ల ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లాప్రధాన కార్యదర్శి పూజరి రమేశ రాష్ట్ర ప్ర భుత్వాన్ని డిమాండ్ చేశారు తప స్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు ఈరోజు రాష్ట్రంలోని అన్ని మండలాలలో ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలైన పిఆర్సిఅమలు పెండింగ్ డీఏల ప్రకటన ఈ కుబేర్ లో పేరు కుపోయిన బిల్లులకు సత్వరం నిధు లు మంజూరు చేయడం పెన్షనర్లకు అన్నిరకాల పెండింగ్ బిల్లులకు నిధులమంజూరు సిపిఎస్ రద్దు కేజీ బీవీ మోడల్ గురుకుల ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలసత్వర పరిష్కారంతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కొరకు సత్వరమే గ్రాంట్ల మంజూరు వంటి సమస్యల పరిష్కారం కోరుతూశనివారం త పస్ ఇబ్రహీంపట్నం మండలశాఖ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ గారి ద్వారా గౌరవ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారికి వినతిపత్రం అందజేయడమైనది ఈకార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు వడ్ల రాజేందర్ ప్రధానకార్యదర్శి రాపోలు ప్రవీణ్ కుమా ర్ జిల్లా కార్యదర్శి పట్నం కృష్ణ, మండల మహిళ కో కన్వీనర్ సంజీవ రాణి మేడం మండల కోశాధికారి రాము మండల మీడియా కన్వీనర్ పొట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం

- శంకర్‌పల్లి మండల శాఖ

**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 4:**

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం శంకర్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీ టి బాలకృష్ణా రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల మేరకు 51% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపు, జీవో–190 అమలు, సిపిఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ వర్తింపు, కేజీబీవి, ఎస్ ఎస్ ఏ, ఎంటీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వేతనాల విడుదలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన శంకర్‌పల్లి డిప్యూటీ తహసీల్దారు గారు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం శంకర్‌పల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి,బసవరాజు మరియు మండల కార్యవర్గ సభ్యులు, జంగయ్య , కృష్ణ,శ్రీనివాస్,వెంకటేష్ ,రాజేందర్, హరిశంకర్,శ్రీకాంత్, జంగయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## శంకర్ పల్లి మండల కుమ్మర సంఘం అధ్యక్షుడిగా కుమ్మర వెంకటేశం

**శంకర్ పల్లి, వెలుతురు జూలై 04:**

శంకర్ పల్లి మున్సిపల్ లోని మల్లికార్జున ఫంక్షన్ హాల్లో మండల కుమ్మర సంఘం కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మండల కుమ్మర సంఘం అధ్యక్షుడిగా శంకర్ పల్లి మున్సిపల్ కు చెందిన పత్తేపురం కుమ్మర వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎన్నుకున్న సంఘ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా కుమ్మర సంఘం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని మరియు కుమ్మర కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా పాండు, బాలరాజ్, లక్ష్మణ్, కోశాధికారిగా పాండు, ప్రచార కార్యదర్శులుగా రాజు, వాసు, కార్యదర్శులుగా ఆంజనేయులు, పరమేష్, ముత్యాలు, గౌరవాధ్యక్షులుగా నారాయణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మండల కుమ్మర సంఘం యూత్ అధ్యక్షుడిగా వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా రాజు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కుమార్, వెంకటేష్, రఘు, వెంకటేశం, మహేష్ తదితరులు ఉన్నారు.

# నామాపురం గ్రామంలో గణన పారాలను పరిశీలించి సూచనలు చేసిన కే.రాములు తహసిల్దార్



**గట్టుప్పల్ వెలుతురు జూలై 04:**

గట్టుప్పల్ మండలం నామాపురం గ్రామంలో తాసిల్దార్ కే . రాములు ఈరోజు సర్ ఓటర్ లిస్ట్ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ బూతులను 231,232 పర్యవేక్షణ చేసినారు. నల్గొండ జిల్లా కలెక్టర్ మరియు ఆర్డీవో చండూరు ఆదేశానుసారం గట్టుప్పల మండలంలోని నామాపురం గ్రామంలో ఓటర్లను చైతన్యం చేయు కార్యక్రమం అదేవిధంగా ఓటర్ లిస్టు పారాన్ని ఏవిధంగా పూర్తి చేయాలి అన్న అంశం పైన యువతను ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఓటర్ లిస్టులో ఏవిధంగా సమాచారాన్ని వ్రాయాలి వారికి ముందుగా అవగాహన కల్పించి గణన పారాన్ని నింపినారు. నామాపురం గ్రామంలో ఓటర్లు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బిఎల్ఓ లకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు సర్పంచ్ వార్డు సభ్యులు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. రాములు తాసిల్దార్ గట్టుప్పల్, కంచుకట్ల సుభాష్ రాష్ట్ర కన్వీనర్ ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం, ఎమ్మార్ై శ్రీజన్, వీరస్వామి, భీమనపల్లి రామయ్య సర్పంచ్, కంచుకట్ల సుదర్శన్ ఉపసర్పంచ్, జాజుల యాదయ్య కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, చినగొని యాదయ్య, చెరుపు జంగయ్య డీలర్, బి ఎల్ ఓ భీమనపల్లి శైలజ, నేర్లకంటి మంగమ్మ భీమనపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఓలో స్టేట్ టాపర్‌గా నిలిచిన ఓక్‌ట్రీ స్కూల్ విద్యార్థిని జోయన్నా



**నార్కట్ పల్లి వెలుతురు జూలై 04:**

నల్గొండ జిల్లా చెర్లపల్లిలోని ఓక్‌ట్రీ స్కూల్ (ది ఫ్యూజన్ స్కూల్) విద్యార్థిని టి.ఎన్. జోయన్నా (5వ తరగతి–బి) ఇంటర్నేషనల్ టాలెంట్ ఒలింపియాడ్ (ITO)లో స్టేట్ టాపర్‌గా నిలిచి ప్రతిభ చాటడంతో పాటు స్కాలర్‌షిప్‌ను కూడా సాధించింది.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ, జోయన్నా సాధించిన ఈ విజయం ఆమె కృషి, ఉపాధ్యాయుల సమర్థ శిక్షణ, తల్లిదండ్రుల సహకారం, అలాగే పాఠశాలలో అమలు చేస్తున్న నాణ్యమైన విద్యా విధానానికి నిదర్శనమని పేర్కొంది.పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి హనుమంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో విద్యార్థులు విద్యా రంగంలో విశేష విజయాలు సాధిస్తున్నారని యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా డైరెక్టర్లు మంగా రెడ్డి , శ్రీ సునీల్ రెడ్డి, విద్యార్థిని జోయన్నాను, ఆమె తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నార్కట్‌పల్లి రోడ్డు వెడల్పు పనులు వెంటనే ప్రారంభించాలి




- **జేఏసీ కరపత్రం విడుదల**

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 04:**

నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు వెడల్పు పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ అన్ని రాజకీయ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలోని జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) కరపత్రాన్ని విడుదల చేసింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రోడ్డు పనులు నిలిచిపోవడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమం, నిరాహార దీక్ష, పట్టణ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని వ్యాపారవేత్తలు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిరుమర్తి యాదయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు మెడబోయిన శ్రీనివాస్ యాదవ్, భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు, సీపీఎం సీనియర్ నాయకుడు కొప్పు శ్రావణ్, టీడీపీ నాయకుడు లింగాల యాదయ్య, జనసేన మండల అధ్యక్షుడు మారీదు శివకృష్ణ, బీఎస్పీ నాయకుడు మేడి వాసుదేవ్, ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ బోడ రావణ్ మహారాజ్, మాజీ ఎంపీటీసీ దుబ్బాక శ్రీధర్, మాజీ మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ వాజిద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణు, వార్డు సభ్యులు నడింపల్లి నరేశ్, అమనగంటి ఐలయ్య, మంద ఉమాగిరి, మెడబోయిన రాంబాబు, వడ్డగొని రామలింగం, అలాగే జేఏసీ నాయకులు చింత సైదులు, నోముల రాజు, పాలకూరి రమేష్, కమ్మంపాటి రాములు, బొబ్బిలి మల్లేష్, ఎస్కే జానీ, మెడబోయిన అశోక్, గోసుల హరీశ్, గంధమల్ల స్వామి, నరేశ్ శివ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ





**మునుగోడు,జూలై4(వెలుతురు):**

మండలంలోని ఇప్పర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.బి జె పి నాయకులు గోలి లింగస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,బి జె పి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి,కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు ప్రజలు దైవభక్తితో జీవించాలని,గ్రామాల్లో సుఖశాంతులు నెలకొనాలని,సకాలంలో వర్షాలు కురిసి రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని స్వామివారిని ప్రార్థించారు. కార్యక్రమానికి సహకరించిన నిర్వాహకులను అభినందిస్తూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను,భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల భిక్షం గౌడ్,మండల అధ్యక్షుడు పెంబల్ల జానయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహా గౌడ్, రాష్ట్ర నాయకుడు భవనం మధుసూదన్ రెడ్డి,జిల్లా నాయకులు బోడిగ అశోక్ గౌడ్,మాదగోని నరేందర్ గౌడ్,మాజీ సర్పంచ్ పగిళ్ల భిక్షం,మండల ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి సతీష్ వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అరుణోదయ నాగన్నకు భీమ్ ఆర్మీ, సీపీఎం నాయకుల విప్లవ నివాళి



**నార్కట్ పల్లి వెలుతురు జూలై 04:**

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక నాయకులు, ప్రజా గాయకుడు, విప్లవ సాంస్కృతిక ఉద్యమానికి విశిష్ట సేవలందించిన అరుణోదయ నాగన్న మృతికి భీమ్ ఆర్మీ, సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, ప్రజల కోసం తన కలాన్ని, గళాన్ని అంకితం చేసి విప్లవోద్యమానికి విశేష సేవలందించిన గొప్ప ప్రజా గాయకుడు నాగన్న అని కొనియాడారు.

అనారోగ్యం నుంచి కోలుకుని మళ్లీ తన గళాన్ని వినిపిస్తారని ఆశించామని, అయితే ఆయన మృతి తీవ్ర విషాదాన్ని కలిగించిందన్నారు. అరుణోదయను ఇంటి పేరుగా మలుచుకుని పాటలు, నాటికల ద్వారా ప్రజా చైతన్యాన్ని పెంపొందించిన గొప్ప కళాకారుడిగా నాగన్న చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆయన మరణం ప్రజా కళారంగానికి తీరని లోటని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.సీపీఎం పట్టణ కార్యదర్శి అమానగంటి ఐలయ్య మాట్లాడుతూ, ఎమర్జెన్సీ కాలంలో నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజా కళారూపాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రజా కళాకారుడు నాగన్న అని అన్నారు. తన సహచరుడు శ్రీపాద శ్రీహరి బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన అనంతరం ఆ స్ఫూర్తితో విప్లవోద్యమంలో అడుగుపెట్టి, కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా ఉద్యమాలకు ప్రేరణనిచ్చే అనేక పాటలు రచించి ఆలపించారని తెలిపారు. సారా వ్యతిరేక ఉద్యమంలో వీధి నాటకాలు, ప్రజా కళారూపాల ద్వారా విశేష చైతన్యం కల్పించారని, అమరవీరులపై రచించిన పాటలు ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపాయని పేర్కొన్నారు.ఈ నివాళి కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కొప్పు శ్రావణ్ కుమార్, మేజర్ గ్రామ పంచాయతీ 5వ వార్డు సభ్యుడు మంద ఉమాగిరి ప్రసాద్, ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ బోడ రావణ్ మహారాజ్, భీమ్ ఆర్మీ నాయకులు ఎస్కే నిరంజన్, బోడ రాకేష్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి పిఆర్‌టియుటిఎస్ నిరంతరం కృషి

- **ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి.**

**మునుగోడు,జూలై 4(వెలుతురు):**



ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పి ఆర్ టి యు టి ఎస్ నిరంతరం కృషి చేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ లో పి ఆర్ టి యు టి ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా హెల్త్ కార్డుల జారీ,మెరుగైన పీఆర్సీ, జీవో–25 సవరణ, ప్రత్యేక టెట్ నిర్వహణ,అక్టోబర్‌లో ప్రమోషన్లు,బదిలీలు చేపట్టేలా ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.సీపీఎస్ రద్దు అంశంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అవసరమైతే ఉద్యమాలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాలం నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జనారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు తిరందాసు సత్తయ్య, మండల అధ్యక్షుడు సయ్యద్ యూసుఫ్ పాషా, గట్టుప్పల్ మండల అధ్యక్షుడు ఓగోటి శంకర్, మండల ప్రధాన కార్యదర్శి మేకల అన్యపు రెడ్డి జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు బాల ప్రసాద్ జిల్లా,రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ మీదుగా బుల్లెట్ ట్రైన్‌కు బీబీ పాటిల్ ప్రయత్నం

- **బుల్లెట్ ట్రైన్ మార్గంపై ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ ఎండీతో భేటీ...**
- **నిమ్జ్ అభివృద్ధి, ప్రాంతీయ ఆర్థిక ప్రగతికి దోహదమని అభిప్రాయం...**



**జహీరాబాద్ వెలుతురు జూలై 04:**

ముంబై–హైదరాబాద్ హైస్పీడ్ రైలు (బుల్లెట్ ట్రైన్) కారిడార్‌ను జహీరాబాద్ మీదుగా ఏర్పాటు చేసే ప్రతిపాదనపై నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (NHSRCL) మేనేజింగ్ డైరెక్టర్ అంజుమ్ పర్వేజ్‌తో జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా జహీరాబాద్‌ను ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్‌తో అనుసంధానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఇరువురు నిర్మాణాత్మకంగా చర్చించారు. ఈ ప్రాజెక్టు అమలైతే ప్రాంతీయ రవాణా అనుసంధానం మెరుగుపడటంతో పాటు ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుందని, పారిశ్రామిక రంగానికి, ముఖ్యంగా జహీరాబాద్ సమీపంలోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (NIMZ) అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని బీబీ పాటిల్ పేర్కొన్నారు.అదేవిధంగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ ద్వారా జహీరాబాద్ ప్రజలకు ఉపాధి, పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలు విస్తరించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ప్రజా పోరాట యోధుడు వంగవీటి మోహన్ రంగా... జిల్లా గణేష్ నేత



**కూకట్ పల్లి జూలై 04 వెలుతురు:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రజానాయకుడిగా గుర్తింపు పొందిన వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా ఆల్విన్ డివిజన్ ఎల్లమ్మబండలో వంగవీటి మోహన్ రంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లా గణేష్ నేత, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వంగవీటి మోహన్ రంగా రాజకీయాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిన నాయకుడని కొనియాడారు. పేదల సంక్షేమం, భూమి పట్టాల పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరాహార దీక్షలు చేపట్టి ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేతగా ఆయన నిలిచిపోయారని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఏడాది ఆయన జయంతి, వర్ధంతి సందర్భంగా అభిమానులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా నివాళులర్పిస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, సత్యనారాయణ, రూబెన్, రెహన్, పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళలు, కాలనీవాసులు, వంగవీటి రంగా అభిమానులు, యువకులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధి తోనే దేశాభివృద్ధి నెట్ డాటా డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్



**వెలుతురు నారాయణఖేడ్ జూలై 04 :**

సంగారెడ్డి జిల్లా :– సమాజ నిర్మాణం జరగాలన్న అందుకు ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతుడై దేశాభివృద్ధిలో తన సహకార అందించాలని నెట్ డాటా డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ అన్నారు. శనివారం నాడు నారాయణ ఖేడ్ మండలం పరిధిలోని సంజీవన్ రావు పేట్, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నెట్ డాటా సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా సభ్యులు చంద్రశేఖర ఆచార్య సౌజన్యంతో స్కూల్ బ్యాగ్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని సర్వాంగీణ వికాసం చెందాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రుల ఆశయ సాధనలో తమ ప్రయత్నం కొనసాగించాలన్నారు. తమ సంస్థ గత పది సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యా సామాగ్రితో పాటు లాప్టాప్ లు వీల్ చైర్స్ ప్రతి నెల రెండు కుటుంబాలకు నిత్యవసర వస్తువులు అందిస్తునామన్నారు . ఇలాంటి సేవలకు మరిన్ని సంస్థలు ముందుకు రావాలని వారు కోరారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు జ్యోతి భూపాల్, శ్రీకాంత్, జకరయ్య,, ఆయా పాఠశాల హెచ్ఎంలు మహేశ్వరరావు,సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు గీత గోసంగి , అమిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భూతం రామచంద్రుకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నివాళి

- **భూతం రామచంద్రుకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నివాళి**



**నార్కట్ పల్లి వెలుతురు జూలై 04:**

నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన భూతం రామచంద్రు అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. భూతం రామచంద్రు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# గంగమ్మ దేవి జాతరకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 04:**

మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన గంగమ్మ దేవి జాతరకి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# దివంగత మాజీ ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఘన నివాళులు

**కరీంనగర్ వెలుతురు జూలై 04:**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ దివంగత శ్రీ కొనిజేటి రోశయ్య గారి జయంతి సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొని దివంగత శ్రీ కొనిజేటి రోశయ్య గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కొనిజేటి రోశయ్య గారు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన ఆదర్శ రాజకీయ నాయకుడని కొనియాడారు. ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన పట్ల ఆయన చూపిన నిబద్ధత భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గారు, డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొయినుద్దీన్ గారు, వేణుమాధవ్ గారు, అసిస్టెంట్ కమిషనర్ రాజ్ మనోహర్ గారు, కార్పొరేటర్లు, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# SIR సర్వేలో అధికారుల నిర్లక్ష్యంతో ఓటర్లు అయోమయంలో ఉన్నారు

- **బీఎల్‌వోలకు సమగ్ర శిక్షణ ఇవ్వాలి...**
- **ప్రజలకు ఫారాలు నింపడంలో సహాయం అందించాలని డిమాండ్...**
- **సీపీఐ డివిజన్ కార్యదర్శి కే. నర్సిములు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 04:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజక వర్గంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) సర్వేలో అధికారుల నిర్లక్ష్యం, సరైన అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని సీపీఐ జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి కే. నర్సిములు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. SIR సర్వేలో భాగంగా ఇంటింటికి ఫారాలు పంపిణీ చేస్తున్నప్పటికీ, వాటిని ఎలా నింపాలి, ఏ కాలమ్‌లో ఏ వివరాలు నమోదు చేయాలనే విషయాన్ని అధికారులు ప్రజలకు వివరించడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలకు కూడా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించలేదని ఆరోపించారు.చదువుకున్నవారికే ఫారాలు నింపడం క్లిష్టంగా ఉంటే, నిరక్షరాస్యులు, వృద్ధులు, గ్రామీణ ప్రాంత ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ముఖ్యంగా 2002 ఓటరు జాబితాలోని సీరియల్ నంబర్, క్రమ సంఖ్య, కుటుంబ




సభ్యుల ఓటరు వివరాలు వంటి సమాచారాన్ని కోరడం వల్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు.ఇలాంటి పరిస్థితుల వల్ల అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల వెంటనే జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు బీఎల్‌వోలు, క్షేత్రస్థాయి సిబ్బందికి SIR ప్రక్రియపై సమగ్ర శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా 2002 నాటి ఓటరు జాబితాలను రెవెన్యూ, ఆర్డీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచి, ప్రజలకు అవసరమైన వివరాలు సులభంగా లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫారాలు నింపలేని వారికి బీఎల్‌వోలు, అధికారులు స్వయంగా సహకరించి SIR ప్రక్రియను ప్రజలకు సులభతరం చేయాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, సమర్థ వంతంగా SIR సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల అధికారులను సీపీఐ డివిజన్ కార్యదర్శి కే. నర్సిములు డిమాండ్ చేశారు.

# సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేయాలి: తపస్

**నార్సింగి వెలుతురు జూలై 4:**



తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తపస్ నార్సింగి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తీగుళ్ల స్వామి, నాఘవేందర్ రావు ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు నార్సింగి తాసిల్దార్ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని , పిఆర్సి రిపోర్టు తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలి అని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె కాలపు ఒక నెల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని, మోడల్ స్కూల్,కేజీబీవీ, గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని,జీఓ 317 చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, గోపాల్,నరేష్, కిషన్, భాస్కర్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దత్తగిరిలో రాజగోపుర మహోత్సవానికి వైభవంగా దేవతల ఆహ్వానం

**శాస్త్రోక్తంగా మహా కుంభస్థాపన, హోమాలు, శిఖర పూజలు...**

**ఆదివారం రాజగోపుర ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 4:**

సంగారెడ్డి జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం రాజగోపుర ప్రారంభోత్సవ వేడుకలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నూతనంగా నిర్మించిన రాజగోపుర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దేవతల ఆహ్వాన కార్యక్రమం, శాస్త్రోక్త పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహా కుంభస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు, జలాధివాసం, క్షీరాధివాసం, పూర్ణాహుతి, పంచగవ్య ప్రాశనం, పంచగవ్య ఆగమశాస్త్ర పూజలను వేదపం



డితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం, మహా కుంభారాధన, అగ్ని ఆరాధన, మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, శయ్యాధివాసం, పుష్పాధివాసం తదితర విశేష పూజలు నిర్వహించారు.ఆశ్రమ పీఠాధిపతులు 1008 అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో రాజగోపుర మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగు తున్నాయి.ఆదివారం జరగనున్న రాజగోపుర ప్రారంభోత్స వానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాజగోపుర నిర్మాణదాత కోలన్ సునీత భద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందగిరి, నందిని శ్రీ, నరసింహారెడ్డి, లింగారెడ్డి, సిద్ధారెడ్డి, నిజాంపేట్ మాజీ సర్పంచ్ సాయిలు, జీవన్‌రావు, సంగారెడ్డితో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తెలంగాణ శ్యామ్'

- **ఎల్ ఎం డి పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ**

**తిమ్మాపూర్ వెలుతురు జూలై 04:**



తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పగిడిపల్లి శ్యామ్ (తెలంగాణ శ్యామ్)పై ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఈ మేరకు శనివారం రోజున గునుకుల కొండపూర్ సర్పంచ్, బిజెపి రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ , నాయకులు బొంతల కళ్యాణ్ చంద్ర, గాజె రమేష్, చింతం శ్రీనివాస్ , సుగుర్తి జగదీశ్వర చారి, ,గడ్డం అరుణ్ , బూట్ల శ్రీనివాస్ లతో కలిసి లిఖిత పూర్వకంగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల్లోకి వెళితే... గత జూన్ 20న కొత్తపల్లి గ్రామంలో ఎల్లమ్మ బోనాల సందర్భంగా రెండు వర్గాల మధ్య చిన్నపాటి వివాదం జరిగింది.ఈ వివాదానికి ఎటువంటి సంబంధం లేని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై పగిడిపల్లి శ్యామ్ అలియాస్ తెలంగాణ శ్యామ్ బాధ్యతారహితంగా, రెచ్చగొట్టేలా మాట్లాడారని అజయ్ వర్మ ఫిర్యాదులో పేర్కొన్నారు.జూలై 2వ తేదీన ఒక యూట్యూబ్ న్యూస్ ఛానల్ (జి.8 )లో తెలంగాణ శ్యామ్ మాట్లాడుతూ కేంద్రమంత్రి , ఎమ్మెల్యే "గ్రామానికి వస్తే చెప్పులతో కొట్టండి" అంటూ ప్రజలను రెచ్చగొట్టేలా , ప్రేరేపించేలా వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ రకమైన వ్యాఖ్యలు గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలను, ప్రజా ప్రతినిధులను అవమానించేలా ఉన్నాయని ఫిర్యాదుదారుడు సొల్లు అజయ్ వర్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆధారాలను సిడి పోలీసులకు సమర్పించారు. ఈ విషయాన్ని పరిశీలించి, తక్షణం తెలంగాణ శ్యామ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అజయ్ వర్మ కోరారు.

# ప్రతి ఓటరికి SIRపై పూర్తి అవగాహన కల్పించడమే లక్ష్యం

- **అల్గోల్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు...**
- **ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ SIR ప్రక్రియలో పాల్గొనాలని పిలుపు...**
- **జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల నర్సింహారెడ్డి...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 04:**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియపై ప్రతి ఓటరికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అల్గోల్ గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్వోలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు SIR ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్య



వ్యవస్థకు మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదైందో లేదో పరిశీలించుకోవాలని, అవసరమైతే సవరణలు, మార్పులు చేసుకునేందుకు SIR ప్రక్రియను వినియోగించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పొరపాట్లు ఉంటే వెంటనే సరిచేసుకోవడం ద్వారా తమ ఓటు హక్కును పరిరక్షించుకోవచ్చని తెలిపారు.SIR ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు, సందేహాలు లేకుండా సరైన సమాచారాన్ని అందించడం ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల బాధ్యత అని ఆయన అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ ప్రక్రియను వివరించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా SIRకు సంబంధించిన మార్గదర్శకాలు, అవసరమైన సమాచారం, సహాయ సహకారాలు అందించేందుకు తాము అందుబాటులో ఉంటామని తెలిపారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని సంప్రదించి వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు.ప్రతి పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని, SIR ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీడీసీ డైరెక్టర్ మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ తుక్కారం, సీనియర్ నాయకులు నర్సింహులు, బీఏల్వోలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# SIR కార్యక్రమంలో బాధ్యతగా పాల్గొనండి

- **బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ పిలుపు**
- **ఓటర్ జాబితా ప్రక్షాళనకు సహకరించాలని విజ్ఞప్తి...**
- **పార్టీ బూత్ ఇన్‌చార్జిలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచన...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 4:**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR – స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ప్రజలతో పాటు పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) బాధ్యతాయుతంగా పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ పిలుపునిచ్చారు.ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి చేపట్టే ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నిజమైన ఓటర్లు మాత్రమే జాబితాలో ఉండేలా చూడడంతో పాటు డబుల్ ఓట్లు, వలస ఓట్లను తొలగించే ప్రక్రియకు అధికారులు, రాజకీయ పార్టీల బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కొత్త యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ఓటరు నమోదులో లేదా సవరణలో ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత బీఎల్ఓలు, ఎన్నికల అధికారులను లేదా రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను సంప్రదించాలని సూచించారు.SIR కార్యక్రమం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ ఇన్‌చార్జిలు, గౌరవ సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, యువకులు అప్రమత్తంగా ఉండి బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించాలని తట్టు నారాయణ విజ్ఞప్తి చేశారు.

# రూ. 41 లక్షలతో 49వ డివిజన్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శ్రీకారం – నగరాభివృద్ధికి ప్రాధాన్యం: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు

**కరీంనగర్ వెలుతురు జూలై 04:**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ.41 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి తో కలిసి శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండిపోయిన రోడ్డు కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రూ.41 లక్షల నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.49వ డివిజన్‌లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కొత్త పైప్‌లైన్ మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా మురుగు కాలువల పూడికతీత పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.నగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రూ.50 కోట్ల UIDF నిధులతో నగరంలోని 66 డివిజన్లలో అభివృద్ధి పనులను రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా 49వ డివిజన్ అభివృద్ధి కోసం అదనంగా రూ.50 లక్షలు కేటాయించామని, త్వరలోనే ఆ పనులు కూడా



ప్రారంభమవుతాయని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రాధాన్యం ఇస్తోందని, కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు గారు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గారు, స్థానిక కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ గార్లు, ఇతర కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హిమాయత్‌నగర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**



ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జి బసవరాజ్ శ్రీనివాస్ హిమాయత్‌నగర్ డివిజన్‌లో పర్యటించారు. బూత్ నంబర్లు 33, 14, 15 పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని అవసరమైన వివరాలను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, హిమాయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నయీమ్, కాంగ్రెస్ నాయకులు అశోక్, మన్మోహన్, జైపాల్, మన్సూర్, సైదు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలలో బీసీ నాయకుల పాత్ర కీలకము

- కాటం నరసింహ యాదవ్ బిసి కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు

**హైదరాబాద్ వెలుతురు న్యూస్ జూలై 04:**




బిజెపి ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షులుగా గ్రేటర్ హైదరాబాద్ బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు అలుక వెంకటేష్ గౌడ్ గారు నియమితులైన సందర్భంగా రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కాటం నరసింహ యాదవ్ గారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాటం నరసింహ యాదవ్ గారు మాట్లాడుతూ దేశంలో బీసీ నాయకుడు ప్రధాని కావడంవల్ల సుస్థిరమైన పాలనతో భారత దేశ ఖ్యాతి ప్రపంచం మొత్తం విస్తరించడం జరిగిందని తెలంగాణలో కూడా రాబోయే రోజుల్లో బీసీ ముఖ్యమంత్రిని చేసుకోవలసిన అవసరం ఉన్నదని దానికోసం ప్రతి రాజకీయ పార్టీలో ఉన్న బీసీ నాయకులు ఏకం కావాల్సిన అవసరం ఏర్పడిందని ఆ కార్యాచరణలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక పెద్దన్న పాత్ర పోషించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత గోల్కొండ బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ గారు మాట్లాడుతూ ఎన్ని పదవులు వచ్చినా నాకు పుట్టినిల్లు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అని ఇంతమంది బీసీల ఆశీస్సులే నా ఎదుగుదల కారణమని ఎక్కడ ఉన్నా ఏ స్థాయిలో ఉన్న బీసీల కోసం నిరంతరం నా పోరాటం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దావ శ్రీనివాసులు, నల్గొండ జిల్లా అధ్యక్షులు చెన్నగోని శివగౌడ్,బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు సుమన్,రమేష్, సురేందర్,సాయికుమార్, ఆదినారాయణ,శ్రీ రాములు, రేణుక,మోహనగౌడ్,వెంకట్, ఈశ్వర్,గీత,సరితగౌడ్, మల్లికార్జునగౌడ్,రఘు నర్సింగ్ గౌడ్ తదితరులు పాల్గొని సన్మానించడం జరిగింది.

# ఇప్పర్తిలో అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**మునుగోడు వెలుతురు జూలై 04:**

మునుగోడు మండలం లో ఇప్పర్తి గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న అభయాంజనేయ స్వామి ప్రతిష్ఠా విగ్రహ ఆవిష్కరణ, కుంభాభిషేక మహోత్సవ ఆహ్వాన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు స్వాగతం పలికి, ప్రతిష్ఠాపన మహోత్సవానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు.రానున్న ప్రతిష్ఠా విగ్రహ ఆవిష్కరణ, కుంభాభిషేక మహోత్సవాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సురిగి నర్సింహా గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# “నన్ను ఆపాలంటే చంపాల్సిందే.. తిరుగుబాటు నేతలకు మమతా బెనర్జీ సవాల్”

- టీఎంసీలో అంతర్గత సంక్షోభం మరింత ముదిరింది
- తిరుగుబాటు నేతలను ద్రోహులంటూ మమతా తీవ్ర వ్యాఖ్యలు
- బీజేపీ ప్రోత్సాహంతోనే అసమ్మతి పెరిగిందని ఆరోపణ
- పార్టీని బలహీనపరచే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని స్పష్టం
- తాను ఉన్నంత వరకు టీఎంసీని ఎవరూ ఆపలేరని ధీమా
- పార్టీ గుర్తు, సిద్ధాంతాలపై ఎలాంటి ప్రభావం ఉండదని వ్యాఖ్య
- చంద్రిమా భట్టాచార్య రాజీనామాతో రాజకీయాల్లో కొత్త చర్చ
- రాష్ట్ర, జాతీయ వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షిస్తానన్న మమత
- బెంగాల్ రాజకీయాల్లో వేడెక్కిన టీఎంసీ అంతర్గత పోరు
- తిరుగుబాటుతో రాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరిగే సూచనలు

**కోల్‌కతా, వెలుతురు జూలై 04:**



తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పార్టీకి చెందిన తిరుగుబాటు నేతలు రితబ్రత బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయం ‘తృణమూల్ భవన్’పై ఆధిపత్యం సాధించినట్లు వెలువడిన వార్తల నేపథ్యంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ పరిణామాలపై స్పందించిన పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తిరుగుబాటు చేసిన నేతలను ద్రోహులుగా అభివర్ణించారు. తమకు ధైర్యం ఉంటే నేరుగా భారతీయ జనతా పార్టీలో చేరి రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. తనను రాజకీయంగా ఎవరూ అడ్డుకోలేరని, తాను ప్రాణాలతో ఉన్నంత వరకు టీఎంసీ ప్రయాణాన్ని ఎవరూ నిలువరించలేరని పేర్కొంటూ, "నన్ను ఆపాలంటే చంపాల్సిందే" అని సంచలన వ్యాఖ్యలు చేశారు.కోల్‌కతాలో నిర్వహించిన మీడియా సమావేశంలో మమతా బెనర్జీ మాట్లాడుతూ, టీఎంసీలో నెలకొన్న అసమ్మతి వెనుక బీజేపీ కుట్ర ఉందని ఆరోపించారు. తిరుగుబాటు నేతలకు ఆ పార్టీ ప్రత్యక్షంగా మద్దతు ఇస్తోందని విమర్శించారు. బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని, ఎన్నికల్లో అక్రమాలు, ఓటు దోపిడీ, రిగ్గింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. తమ పార్టీ నాయకులపై రాజకీయ కక్షతో తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, అయితే ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. టీఎంసీ సిద్ధాంతాలు ఎప్పటికీ బీజేపీ సిద్ధాంతాలకు వ్యతిరేకమేనని, ఎలాంటి ఒత్తిళ్లకూ తాను తలవంచబోనని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితురాలిగా గుర్తింపు పొందిన చంద్రిమా భట్టాచార్య తన సంస్థాగత పదవులన్నింటికీ రాజీనామా చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఆమె తిరుగుబాటు నేతలతో కలిసి కనిపించడం టీఎంసీ అంతర్గత సంక్షోభాన్ని మరింత స్పష్టంగా చూపిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర, జాతీయ వ్యవహారాలను ఇకపై తానే నేరుగా పర్యవేక్షిస్తానని మమత ప్రకటించారు. పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, క్రమశిక్షణను కఠినంగా అమలు చేస్తామని ఆమె వెల్లడించారు. తిరుగుబాటు వల్ల పార్టీ బలహీనపడదని, టీఎంసీ గుర్తు, సిద్ధాంతాలు ప్రజల మనసుల్లోనే ఉంటాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఎదుర్కొన్న ఓటమి తర్వాత పార్టీలో అసంతృప్తి పెరుగుతున్న నేపథ్యంలో తాజా పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. బీజేపీ తొలిసారిగా రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకోవడంతో టీఎంసీ నాయకత్వంపై విమర్శలు, అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో తిరుగుబాటు నేతల చర్యలు, కీలక నాయకుల రాజీనామాలు పార్టీ భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశాలపై విశ్లేషణలు సాగుతున్నాయి. అయితే ఈ సవాళ్లన్నింటినీ ఎదుర్కొని పార్టీని మరింత బలోపేతం చేస్తామని మమతా బెనర్జీ స్పష్టం చేయగా, రానున్న రోజుల్లో బెంగాల్ రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# చౌటుప్పల్ మున్సిపాలిటీ మరియు మండల ప్రజలకు శుభవార్త..



జూలై 5 ఆదివారం రోజున కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపాలిటీలో మరియు మండలంలో నివసించే ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడును

ఉచిత వైద్య శిబిరం వేదిక:– చౌటుప్పల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో

సమయం:– ఉదయం 9 గంటల నుండి

గమనిక:– 50 సంవత్సరాల వయసు పైబడిన వారు విధిగా ఆధార్ కార్డుతో పాటు, మీ ఫోన్ నెంబర్,గతంలో మీరు వాడుతున్న మందులని కూడా వెంట తీసుకురాగలరు, ఇట్టి అవకాశం సద్వినియోగపర్చుకోగలరు.

ముఖ్య గమనిక: కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉన్న వారిని వెంటనే హైదరాబాద్ తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి తీసుకొస్తారు.

ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగలరు.

# ఈ20 కాదు.. కల్తీ ఇంధనమే అసలు కారణం: టయోటా స్పష్టీకరణ

- వైరల్ వీడియోపై అధికారికంగా స్పందించిన టయోటా కిర్లోస్కర్ మోటార్
- ఇన్నోవా హైక్రాస్‌లో వచ్చిన లోపాలకు ఈ20 పెట్రోల్ కారణం కాదని వెల్లడి
- నాణ్యత లేని, కలుషిత ఇంధనమే సమస్యకు మూలమని నిర్ధారణ
- ట్యాంక్ శుభ్రపరిచి కొత్త ఇంధనం నింపగానే సజావుగా నడిచిన వాహనం
- ఇంజిన్, ఫ్యూయల్ సిస్టమ్‌కు శాశ్వత నష్టం జరగలేదని కంపెనీ స్పష్టం
- ఈ20 ఇంధనానికి అనుగుణంగానే హైక్రాస్‌ను రూపొందించామని ప్రకటన
- కఠిన పరీక్షల అనంతరమే వాహనాలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నామని




వివరణ

**బెంగళూరు, వెలుతురు జూలై 04:**

బిహార్‌కు చెందిన ఓ టయోటా ఇన్నోవా హైక్రాస్ యజమాని సోషల్ మీడియాలో చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో టయోటా కిర్లోస్కర్ మోటార్ అధికారికంగా స్పందించింది. ఈ20 (E20) పెట్రోల్ వినియోగం వల్ల తన వాహనం ఇంజిన్‌లో వైబ్రేషన్స్, నాకింగ్, బ్రేక్‌డౌన్ వంటి సమస్యలు తలెత్తాయని వినియోగదారుడు వీడియోలో ఆరోపించినప్పటికీ, సంస్థ నిర్వహించిన సాంకేతిక పరిశీలనలో ఆ వాదనకు ఆధారాలు లభించలేదని తెలిపింది. వాహనంలో తలెత్తిన సమస్యకు ఈ20 పెట్రోల్ కారణం కాదని, నాణ్యత లేని కల్తీ ఇంధనమే అసలు కారణమని స్పష్టం చేసింది.ఈ ఘటనపై టయోటా సాంకేతిక నిపుణుల బృందం వాహనాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేసింది. ఇంజిన్, ఫ్యూయల్ సిస్టమ్ లేదా ఇతర కీలక భాగాలకు ఎలాంటి శాశ్వత నష్టం జరగలేదని నిర్ధారించింది. అయితే వాహనం ఫ్యూయల్ ట్యాంక్‌లో తీవ్రంగా కలుషితమైన ఇంధనం ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని వెల్లడించింది. అదే కారణంగా వాహనం పనితీరు దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు కంపెనీ తెలిపింది. ఈ20 ఇంధన వినియోగం వల్ల ఎలాంటి సాంకేతిక లోపాలు ఏర్పడలేదని స్పష్టం చేసింది.కంపెనీ సర్వీస్ ప్రోటోకాల్ ప్రకారం ఫ్యూయల్ ట్యాంక్, ఫ్యూయల్ లైన్లను పూర్తిగా ఖాళీ చేసి శుభ్రపరిచిన అనంతరం ప్రామాణిక ఈ20 పెట్రోల్‌ను నింపి మళ్లీ పరీక్షించినట్లు వెల్లడించింది. ఆ తర్వాత వాహనం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నడిచిందని పేర్కొంది. తాత్కాలిక లోపం పూర్తిగా తొలగిపోయినట్లు నిర్ధారించిన తర్వాతే వాహనాన్ని యజమానికి అప్పగించినట్లు తెలిపింది.

# తెలంగాణ మంత్రి లక్ష్మణ్ పై ఆరోపణలు ఉపసంహరించుకోవాలి

- జాగ్రత్త ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్
- తెలంగాణ మాదిగ మాహాశక్తి కో ఆర్డినేటర్ డా“సాగరపు ప్రసాద్రావు మాదిగ డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**



రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్కుమార్పై బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ అహంకార పూరితమైన ఆరోపణలు చేశారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ మాదిగ మాహాశక్తి కో ఆర్డినేటర్ డా“సాగరపు ప్రసాద్రావు మాదిగ. డిమాండ్ చేశారు. లేని పక్షంలో వారి పర్యటన లను అడుగడునా అడ్డుకుంటామని హెచ్చరించారు. శుక్ర వారం దోమలగూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తూ పెద్దపీట వేస్తున్నదని అన్నారు. డిప్యూటీ సీఎం, అసెంబ్లీ స్పీకర్తోపాటు తెలంగాణలోని దళిత ఎమ్మెల్యేలకు మంత్రు లుగా అవకాశం కల్పించి క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ ఎస్సీ గురుకులాలలో అత్యంత పారదర్శ కంగా అసైన్డ్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తే అవినీతి జరిగిం దని ఆరోపించడం సరికాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దళితుడికి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చి అనేక సార్లు అవమానించిన ఘటనలను దళిత సమాజం ఎప్పటికీ మర్చిపోదన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్కు మంత్రి పదవి వస్తే బీఆర్ఎస్ నేతలు కుల అహకారంతో తప్పుడు ఆరోపణలు చేస్తూ ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమని వారు హెచ్చరించారు.

# రామన్నపేటలో వైభవంగా శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 04:**



పట్టణ కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భూ లీలా సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ వేడుకలు కనులపండువగా సాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలను అత్యంత వైభవంగా,నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా జెల్లా రజనీ – వెంకటేశు దంపతులు స్వామివారి మూలమూర్తులకు పట్టు వస్త్రాలను అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన పవిత్ర హోమ కార్యక్రమంలో స్థానిక,ప్రజాప్రతినిధులు,ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో,పాల్గొన్నారు.స్వామివారి పూజా కార్యక్రమాల్లో మరియు హోమంలో సర్పంచ్ గరిక రాధిక,సత్యనారాయణ,ఉపసర్పంచ్ మోటే రమేష్, ఆలయ చైర్మన్ ఉపేందర్ జానకి, కొంపల్లి సుమలత సురేష్ ,సిద్ధం లక్ష్మీబాయి లింగయ్య,రాపోలు రాజశేఖర్, మిరియాల కవిత వెంకటయ్య, మిర్యాల జయమ్మ రమేష్, చంద్రగిరి పుష్ప నరసింహ, బొడ్డు శంకరయ్య, జింకల నరసింహ, దొంత యాదగిరి, అలిసేరు వంశీ, జ్యోతి, ఇంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# అభినవ తుగ్లక్...జగన్..!!

- **పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్**

**విజయవాడ వెలుతురు జూలై 04:**

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతుంటే ఓర్వలేని వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ఘడియ కో మాట మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల్ని అయోమయానికి గురి చేస్తూ రాష్ట్రానికి తీరని అన్యాయం చెయ్యాలని ప్రయత్నాలు చేయటం దుర్మార్గం. 2019 ముందు జగన్ గారు అమరావతి రాజధాని దాన్ని నేనే నేర్పిస్తాను చంద్రబాబు నాయుడు గారికి చేతకాదు అని చెప్పి అధికారంలోకి వచ్చి మాట మార్చి మూడు రాజధానులు అంటూ మూడుముక్కల ఆట ఆడారు. 2024 ఎన్నికలకి మూడు రాజధానులు వర్సెస్ అమరావతి రాజధాని అని వైసిపి పార్టీ మరియు ఎన్డీఏ కూటమి పార్టీలు వెళ్తే ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ప్రజలిచ్చిన తీర్పుని శిరసా వహించి అమరావతికి జై కొట్టాల్సిన జగన్ మోహన్ రెడ్డి గారు మరోసారి మాట మార్చి మావిగన్ రాగం ఎత్తుకున్నారు. 2029 ఎన్నికలకి మావిగన్ వర్సెస్ అమరావతి అంటూ ఇటీవల ప్రెస్ మీట్ పెట్టి బీరాలు పలికారు. ఇంతలోనే మళ్లీ మాట మార్చి రాష్ట్ర రాజధాని విజయవాడేనని అంటున్నారు. దేశ చరిత్రలో తుగ్లక్ రాజు గురించి అందరికీ తెలుసు. అతను తన రాజధాని ఢిల్లీ నుండి దౌలుతాబాద్ కి మార్చి అనేకమంది పొట్టన పెట్టుకుని ప్రజల్ని అష్ట కష్టాలు పాలు చేశాడు. కొన్ని సంవత్సరాలకి మళ్లీ రాజధానిని దౌలుతాబాద్ నుండి ఢిల్లీకి మార్చి మరోసారి ప్రజల్ని ఇబ్బందులకి గురి చేశాడు. అందుకే అతన్ని చరిత్ర పిచ్చి తుగ్లక్ గా గుర్తుపెట్టుకుంది. ఈరోజు జగన్మోహన్ రెడ్డి గారు కూడా "అభినవ తుగ్లక్" గా తయారయ్యారు అని చెప్పడంలో ఏమాత్రం సందేహం అక్కరలేదు.దేశంలోని అన్ని రాజకీయ పక్షాలు అమరావతికి జై కొట్టాయి ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్ప. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిగా దేశ ప్రజాస్వామ్యానికి దేవాలయమైన పార్లమెంట్లో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి గారు ఈ రకంగా మాట్లాడటానికి అసలు కారణం ఏంటో తెలియక ప్రజలు తల పట్టుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు గారు అమరావతి నిర్మాణాన్ని ప్రారంభించారు కాబట్టి తానెందుకు దాన్ని కొనసాగించాలి అన్న సంకుచిత భావం తప్పితే మరొకటి కనబడలేదు. బహుశా దేశ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిపై ఒక దశాబ్ద కాలంగా జరుగుతున్న చర్చ రచ్చ విష ప్రచారం బహుశా వేరే ఏ రాష్ట్రంలో జరిగి ఉండకపోవచ్చు. జగన్ లాంటి సంకుచిత భావాలు కలిగిన ప్రతిపక్షం వేరే రాష్ట్రంలో లేకపోవటమే దీనికి కారణం కావచ్చు. ఏదోరకంగా గడికో మాట మాట్లాడుతూ అమరావతి నిర్మాణాలని ఆపించేయాలని, పెట్టుబడులు ఇక్కడికి రాకుండా చేయాలని, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని జగన్ గారి దృఢ సంకల్పంగా కనబడుతోంది. జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజధాని రైతుల ఆవేదనని అర్థం చేసుకునే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు సరిగదా వారిని అనరాని మాటలతో దూషించి, పోలీసులతో వారిపై దౌర్జన్య కాండ పర్వానికి తరలించారు. పిల్లలు మహిళలు అని కూడా చూడకుండా వారిపై దాడి చేశారు. ఎన్నడూ



అమరావతి రైతుల సమస్యని ఆవేదనని పట్టించుకోలేదు. అయితే ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక జగన్మోహన్ రెడ్డి అండ్ కో రాజధాని రైతుల పరిరక్షణ సమితి పేరు మీద ఉండవల్లి పెనుమాకకి వెళ్లి రాజధాని రైతుల పరామర్శ పేరుతో ఓ కొత్త నాటకానికి తెర తీయడం సిగ్గుచేటు. ఊరికి మంచి జరుగుతూ ఊర్లో వాళ్ళందరూ సహకరిస్తూ ఓ నలుగురు మాత్రం వ్యతిరేకిస్తుంటే ఆ నలుగురికి బాసటగా ఉంటాను ఇక్కడ ఏదో అన్యాయం జరిగిపోతోంది అని రెచ్చగొట్టే వాడిని ఏమంటారో అదే ఈరోజు రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డిని అంటున్నారు. ఆయన ఉద్దేశం అమరావతి నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లో ఆపి 2029 ఎన్నికల్లో ఇది చేతకాని ఎన్డీఏ ప్రభుత్వం అని ప్రజల ముందు ఎండ కట్టాలి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలి.వైయస్సార్సీపి అధినేత జగన్మోహన్ రెడ్డి గారు తల కిందులుగా తపస్సు చేసిన అమరావతి నిర్మాణం ఆపలేరు రాష్ట్ర రాజధాని అమరావతి అన్న నగ్న సత్యాన్ని మార్చలేరు. అమరావతిపై జగన్ గారు బురద జల్లుతున్న ప్రతిసారి రాష్ట్ర ప్రజల్లో కోపం పెరుగుతోంది, ఎన్డీఏ ప్రభుత్వం యొక్క సంకల్పం ద్విగినీకృతం అవుతోంది. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా 2029 ఎన్నికల వెళ్ళే లోపు రాష్ట్రంలో ఉన్న డబల్ ఇంజన్ సర్కార్ అమరావతిలో మౌలిక వసతులు పూర్తి చేసి, రైతులకి ప్లాట్లు ఇచ్చి, వివిధ ప్రభుత్వ భవనాలు పూర్తిచేసి ఒక చక్కటి స్వరూపం తీసుకొచ్చి మరో ఐదేళ్లు ప్రజల ఆశీర్వాదం కొరతం.

# ఆహార కల్తీపై 'హెచ్-ఫాస్ట్' ఉక్కుపాదం

- **100 రోజుల్లో 185 కేసులు**
- **122 టన్నుల కల్తీ ఫుడ్ సీజ్**
- **వరుసగా మెరుపు దాడులు**
- **టన్నుల కొద్దీ సామాగ్రి సీజ్**
- **రాజేంద్రనగర్, గోల్కొండ అధిక కేసులు**
- **మార్కెట్లో భారీగా నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్**
- **కుళ్లిన చికెన్, మాంసం వ్యర్థాల గుట్టురట్టు**



**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

హైదరాబాద్ నగర ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఆహార కల్తీ మాఫియాపై టాస్క్‌ఫోర్స్ విభాగం 'హెచ్-ఫాస్ట్' ఉక్కుపాదం మోపింది. నగరంలోని వివిధ హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, తయారీ కేంద్రాలపై అధికారులు నిరంతరం దాడులు చేస్తూ కల్తీ రాయుళ్ల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా రంగంలోకి దిగిన హెచ్-ఫాస్ట్ బృందాలు గడిచిన కొన్ని నెలల్లోనే రికార్డు స్థాయిలో తనిఖీలు చేపట్టి, భారీగా అక్రమాలను వెలుగులోకి తెచ్చాయి.నగర వాసుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన 'హెచ్-ఫాస్ట్' బృందాలు ప్రతిరోజూ పక్కా సమాచారంతో మెరుపు దాడులు నిర్వహిస్తున్నాయి. బడా రెస్టారెంట్ల నుంచి వీధి చివర ఉండే చిన్న చిన్న హోటళ్ల వరకు ఎవరినీ వదలకుండా తనిఖీలు చేస్తున్నారు. కిచెన్ ఏరియాలో పరిశుభ్రత లోపించడం, కుళ్లిన రసాయనాలు వాడటం, కాలం చెల్లిన పదార్థాలతో వంటకాలు సిద్ధం చేయడం వంటి దారుణాలను ఈ దాడుల్లో అధికారులు ప్రత్యక్షంగా గుర్తిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై భారీగా జరిమానాలు విధిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు.మార్చి 19న ప్రారంభమైన ఈ ప్రత్యేక హెచ్-ఫాస్ట్ దాడుల ప్రస్థానం విజయవంతంగా 100 రోజులు పూర్తి చేసుకుంది. ఈ వంద రోజుల స్వల్ప వ్యవధిలోనే అధికారులు ఏకంగా 185 క్రిమినల్ కేసులను నమోదు చేసి రికార్డు సృష్టించారు. కేవలం కేసులు పెట్టడమే కాకుండా, మానవ ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే సుమారు 121.87 టన్నుల కల్తీ, అత్యంత నాణ్యతలేని ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ భారీ రికవరీ నగరంలో కల్తీ ఏ స్థాయిలో పేరుకుపోయిందో స్పష్టం చేస్తోంది.హెచ్-ఫాస్ట్ అధికారులు నగరవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ విస్తృతంగా సోదాలు జరిపారు. అయితే అన్ని జోన్లతో పోలిస్తే రాజేంద్రనగర్, గోల్కొండ పరిసర ప్రాంతాల్లో కల్తీ వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వంద రోజుల్లో నమోదైన మొత్తం కేసుల్లో అత్యధికంగా ఒక్క రాజేంద్రనగర్ జోన్‌లోనే 55 కేసులు నమోదు కావడం గమనార్హం. ఆ తర్వాత స్థానంలో ఉన్న గోల్కొండ జోన్‌లో అధికారులు 44 కేసులను బుక్ చేశారు. ఈ ప్రాంతాల్లోని పలు గోడౌన్లపై నిఘా ఉంచి అక్రమాలను అడ్డుకున్నారు.హోటళ్లు, ఇళ్లలో విరివిగా వాడే అల్లం వెల్లుల్లి పేస్ట్‌లో జరుగుతున్న కల్తీని చూసి అధికారులు సైతం దిగ్భ్రాంతి చెందారు. ప్రమాదకర రసాయనాలు, చెక్కపొడి కలిపి తయారు చేస్తున్న దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను అధికారులు సీజ్ చేశారు. వీటితో పాటు కృత్రిమంగా, విషపూరిత రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల వివిధ రకాల పండ్లను స్వాధీనం చేసుకుని మార్కెట్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇవి తింటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.బిర్యానీలు, చికెన్ వంటకాలకు నగరంలో ఉన్న డిమాండ్‌ను కొందరు కేటుగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. హెచ్-ఫాస్ట్ దాడుల్లో ఏకంగా 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు (వేస్ట్‌మెటీరియల్) పట్టుబడ్డాయి. వీటిని ఇతర ఆహార పదార్థాల తయారీలో వాడుతున్నట్లు తేలింది. దీనితో పాటు నిల్వ ఉంచిన, కుళ్లిన వాసన వస్తున్న 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మేక మాంసాన్ని అధికారులు వేర్వేరు చోట్ల స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకే వస్తోందని ఇలాంటి మాంసం కొని వినియోగదారుల ప్రాణాల మీదకు తెస్తున్న హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.కేవలం మాంసం, పండ్లే కాకుండా నిత్యావసరాలైన పాల పదార్థాలలోనూ యథేచ్ఛగా కల్తీ సాగుతోంది. ఈ దాడుల్లో భారీ ఎత్తున నకిలీ కోవా, పనీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్‌తో పాటు రంగులు కలిపిన కల్తీ టీ పొడి కూడా భారీగా పట్టుబడింది. ప్రజా ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమించిన దాదాపు 247 కేసులను తదుపరి కఠిన చర్యల కోసం జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి హెచ్-ఫాస్ట్ అధికారులు బదిలీ చేశారు. అలాగే ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు, ప్రత్యేకంగా పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదయ్యాయి.ఆహార నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన అధికారులు.. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల నిర్వాహకులకు కఠినమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రతి కేంద్రానికి తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ ఉండాలని, వంటగదిలో ఖచ్చితంగా ఎఫ్ఐఎఫ్ఓ పద్ధతిని పాటించాలని ఆదేశించారు. ఒకసారి వాడిన వంట నూనెను పదే పదే పునర్వినియోగం చేయడంపై (రీయూజ్) తీవ్ర ఆంక్షలు విధించారు. నిబంధనలు మీరితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.ప్రజల ప్రాణాలతో ఆడుకునే కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనకాడబోమని నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. నగరంలో ప్రతిరోజూ సగటున 15 ఆహార కల్తీ ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన వెల్లడించారు. ఎక్కడైనా నకిలీ, కల్తీ ఆహార పదార్థాల తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే తక్షణమే డయల్ 100కు గానీ, లేదా హెచ్-ఫాస్ట్ ప్రత్యేక వాట్సాప్ మొబైల్ నంబర్ 8712661212కు మెసేజ్ లేదా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కేతన్ హత్య కేసులో కీలక మలుపు..

- **లై డిటెక్టర్ టెస్ట్ కు నో చెప్పిన నిందితులు**
- **నిందితులకు కోర్టు నోటీసులు**
- **సమ్మతి లేకుండా పరీక్ష వద్దన్న కోర్టు**
- **జరగని పెళ్లికి ఎంట్రీ టికెట్లు**
- **సియా మెసేజ్‌లు కీలక ఆధారాలు**
- **డిలీట్ చేసిన డేటా రికవరీ**
- **కోడ్ భాష ఛేదనలో పోలీసులు**
- **మరో ఫోన్ స్వాధీనం**
- **ఫోరెన్సిక్‌కు పంపిన పరికరం**
- **యరవాడ జైలుకు నిందితుల తరలింపు**



**పుణె వెలుతురు జూలై 04:**

పుణెలో యువ రియల్టర్ కేతన్ అగర్వాల్ (26) హత్య కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రధాన నిందితులు సియా గోయల్, చేతన్ చౌదరికి పాలీగ్రాఫ్ (లై డిటెక్టర్) పరీక్ష నిర్వహించేందుకు అనుమతివ్వాలని పోలీసులు కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితులకు నోటీసులు జారీ చేసింది.అయితే పాలీగ్రాఫ్ పరీక్షకు సియా, చేతన్ ఇద్దరూ అంగీకరించలేదు. దీంతో వారి సమ్మతి లేకుండా నిజ నిర్ధారణ పరీక్ష నిర్వహించవద్దని కోర్టు పోలీసులను ఆదేశించింది.

నిందితులు స్వచ్ఛందంగా అంగీకరిస్తే మాత్రమే అలాంటి పరీక్షకు అనుమతిస్తామని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఇద్దరికీ 14 రోజుల పోలీసు కస్టడీ మంజూరు కావడంతో వారిని యరవాడ సెంట్రల్ జైలుకు తరలించారు.

**జరగని పెళ్లికి ఎంట్రీ టికెట్లు..!**

దర్యాప్తులో సియా మొబైల్ ఫోన్‌ను పరిశీలించిన పోలీసులు కీలక ఆధారాలను గుర్తించారు. ఆమె తన స్నేహితురాలికి పంపిన సందేశాల్లో పెళ్లికి ఆహ్వానిస్తూ, అతిథుల ఎంట్రీ టికెట్లు బుక్ చేయడానికి ఆధార్ కార్డు పంపాలని కోరినట్లు తేలింది. అయితే అలాంటి పెళ్లి జరగకపోయినా టికెట్లు బుక్ చేస్తున్నట్లు పేర్కొనడం అనుమానాలకు తావిచ్చింది. కేతన్‌తో నిశ్చితార్థం జరిగినప్పటి నుంచే అతడిని వదిలించుకునే ప్రణాళికలో సియా ఉన్నట్లు ఈ సందేశాలు సూచిస్తున్నాయని పోలీసులు కోర్టుకు తెలిపారు.

**డిలీట్ చేసిన డేటా రికవరీ**

నిందితుల మొబైల్ ఫోన్‌లలో తొలగించిన కాల్ రికార్డులు, చాట్‌లు, ఇతర డిజిటల్ డేటాను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు లోనావాలా పోలీసులు కోర్టుకు వెల్లడించారు. అందులో సియా, చేతన్ కోడ్ భాషలో సంభాషించినట్లు గుర్తించామని, వాటి అర్థాన్ని డీకోడ్ చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.ఈ కేసుతో సంబంధం ఉందని అనుమానిస్తున్న చేతన్ స్నేహితుడిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అంతేకాకుండా, ఎవరికీ తెలియకుండా సియా దాచిపెట్టిన మరో మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆ పరికరాన్ని ఫోరెన్సిక్ పరీక్షకు పంపినట్లు, అందులోని సమాచారం దర్యాప్తుకు మరింత కీలకంగా మారే అవకాశం ఉందని పోలీసులు కోర్టుకు వివరించారు.

# ప్రజల మధ్య నుంచి ఎదిగి రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రజానాయకుడు సీఎం రేవంత్ రెడ్డి: మంత్రి సీతక్క

- **అలాంటి నాయకుడిపై విపక్షాలు వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలి: సీతక్క**

**నిజామాబాద్, వెలుతురు జూలై 4:**





కొండారెడ్డి పల్లెలో పుట్టి జెడ్పీటీసీగా ప్రజా జీవితాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకుడిగా ఎదిగారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రజా జీవితంలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మధ్య నుంచి ఎదిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలపై నిర్మాణాత్మకంగా మాట్లాడితేనే ప్రతిపక్షాలకు గౌరవం లభిస్తుందని అన్నారు.నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క, ప్రజల మధ్య నుంచే ఎదిగిన నాయకుడిగా రేవంత్ రెడ్డి ప్రజల కష్టసుఖాలను ప్రత్యక్షంగా తెలుసుకుని పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. రైతు, యువత, మహిళలు, పేదల సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి విజ్ఞప్తి మేరకు గిరిజన సంక్షేమానికి సంబంధించిన హాస్టళ్లు, వసతి గృహాలు, డైనింగ్ హాళ్లు ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తండాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు రూ.7 కోట్లతో రెండు రోడ్లను ప్రారంభించామని, పంచాయతీరాజ్ శాఖ ద్వారా సుమారు రూ.80 కోట్లు, ఆర్అండ్‌బీ శాఖ ద్వారా మరో రూ.90 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని, వర్షాకాలం అనంతరం పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐదేళ్ల పాలనకు అవకాశం ఇచ్చారని, ఆ గడువులో ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రమే కాకుండా మేనిఫెస్టోలో లేని పలు సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలకు ఇళ్లు, రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలోనే భారీ స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేస్తోందని తెలిపారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపుతోందని మంత్రి సీతక్క ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర వాటాను తగ్గించి రాష్ట్రాలపై అదనపు భారం మోపిందని అన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు మానుకుని ప్రజా ప్రయోజనాలపై నిర్మాణాత్మక పాత్ర పోషించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# హర హర మహాదేవ్..

- **అమరనాథ్‌లో తొలి మంచు శివలింగ దర్శనం**
- **తొలి రోజే 12 వేల మంది దర్శనం**
- **నువ్వాన్, బాల్‌టాల్ నుంచి యాత్ర కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**
- **వాతావరణ అవాంతరాల మధ్య యాత్ర భక్తులతో మారుమోగిన హిమాలయాలు**
- **మోదీ నుంచి భక్తులకు లేఖ**
- **ఐదు ప్రతిజ్ఞలు చేయాలన్న ప్రధాని**
- **'వోకల్ ఫర్ లోకల్'కు ప్రాధాన్యం పచ్చదనాన్ని పెంచాలని పిలుపు**
- **'దేశం ప్రథమం'తో యాత్ర సాగాలని సూచన**

**ఢిల్లీ వెలుతురు జూలై 04:**

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య ఈ ఏడాది అమరనాథ్ యాత్ర విజయవంతంగా ప్రారంభమైంది. 'హర హర మహాదేవ్' నినాదాలతో హిమాలయాలను మార్మోగిస్తూ బయల్దేరిన భక్తులకు శుక్రవారం మంచుశివలింగం తొలి దర్శనమిచ్చింది. యాత్ర మొదటి రోజే సుమారు 12 వేల మంది భక్తులు పవిత్ర మంచుశివలింగాన్ని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.జమ్మూకశ్మీర్‌లోని హిమాలయ ప్రాంతంలో సహజసిద్ధంగా ఏర్పడే మంచుశివలింగాన్ని దర్శించుకునేందుకు గురువారం నువ్వాన్ (పహల్గామ్ మార్గం), బాల్‌టాల్ బేస్‌క్యాంపుల నుంచి రెండు బృందాలుగా భక్తులు బయలుదేరారు. తొలి రోజు దర్శనం చేసుకున్న వారిలో 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200 మంది చిన్నారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. యాత్ర మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా భద్రతా బలగాలను మోహరించారు.



**భక్తులకు ప్రధాని మోదీ లేఖ**

అమరనాథ్ యాత్ర ప్రారంభమైన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ఎక్స్ వేదికగా రెండు పేజీల లేఖ రాశారు. ఈ సందర్భంగా యాత్రికులు ఐదు ప్రతిజ్ఞలు చేయాలని సూచించారు. పరిశుభ్రతను పాటించడం, జమ్మూకశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం (వోకల్ ఫర్ లోకల్), ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, రక్షాబంధన్ సందర్భంగా తోబుట్టువులకు మొక్కలను బహుమతిగా ఇచ్చి పచ్చదనాన్ని ప్రోత్సహించడం, 'దేశం ప్రథమం' అనే భావనతో అమరనాథ్ యాత్రను సాగించాలని ప్రధాని పిలుపునిచ్చారు.

# తండ్రుల పేరిట పురస్కారాలు ఇవ్వడం గొప్ప సంస్కృతి

- రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్
- జివి శ్యాంప్రసాద్ లాల్





**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

మన భారతీయ సంస్కృతి "మాతృదేవో భవ, పితృదేవో భవ" అని బోధించిందని, తల్లిదండ్రుల పేరిట పురస్కారాలు అందించడం గొప్ప సంస్కృతి అని రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ జివి శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. ఈరోజు సాయంత్రం కరీంనగర్ ఫిలిం భవన్ లో సమైక్య సాహితి ఆధ్వర్యంలో తండ్రుల పేరిట అందజేస్తున్న విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి తండ్రులను దేవతలతో సమానంగా భావించే మన సంస్కృతి లో వారి పేరును సేవతో, సత్కార్యాలతో, సన్మానాలతో చిరస్థాయిగా నిలబెట్టడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. నాన్న ల పట్ల ప్రేమను కేవలం భావోద్వేగంగా కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా వ్యక్తీకరించడం నిజంగా ప్రశంసనీయమని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు, గద్దర్ పురస్కార గ్రహీత పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఋణం ఎన్నటికీ తీర్చలేనిదని వారి పేరు సమాజంలో గౌరవంగా నిలిచేలా చేయడం, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం, వారి విలువలను భావితరాలకు అందించడం నిజమైన ప్రేమ కు నిదర్శనం అని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నాన్నల పేరిట అందించే ఈ పురస్కారాలు సంస్థకు ఎంతో గర్వకారణమని అన్నారు. ముందుగా నంది శ్రీనివాస్ రూపొందించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ పురస్కార ప్రదాత గా వ్యవహరించే ఆచార్య రజనిశ్రీ నృత్య పురస్కారాన్ని ప్రముఖ నృత్య కళాకారులు, అధ్యక్షులు ఆదివాసీ నృత్య నికేతన్ జె. రతన్ కుమార్ కు ప్రదానం చేశారు. సీనియర్ ఫిజీషియన్ డా. డి. రఘురామన్ అందిస్తున్న డాక్టర్ దారం నాగభూషణం పురస్కారాన్ని , ప్రముఖ చరిత్ర పరిశోధకులు, కవి కరిపె రాజ్ కుమార్ కు ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని సమైక్య సాహితి అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్ ప్రదాత గా అందజేసే మాడిశెట్టి మల్లయ్య ఉపాధ్యాయ పురస్కారాన్ని అసోసియేట్ ప్రొఫెసర్, ఛైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొ. ఎస్. రఘు కు అందజేశారు. పూర్వ డిప్యూటి న్యూస్ ఎడిటర్, ఈనాడు రావికంటి శ్రీనివాస్ ప్రదాత గా అందించే రావికంటి రామయ్య గుప్త పురస్కారాన్ని ప్రముఖ పద్యకవి, చతుర, విపుల పూర్వ ఎడిటర్ చంద్ర ప్రతాప్ కంతేటి కి అందజేశారు. సమైక్య సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.అనంతాచార్య అందించే సంపత్ కుమారాచార్య స్మారక సంగీత పురస్కారాన్ని ప్రముఖ మృదంగ కళాకారులు నమిలికొండ వేణుగోపాల్ కు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పురస్కార ప్రదాతలు మరియు పురస్కార గ్రహీతలు మాట్లాడారు. జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం లో రతన్ కుమార్ శిష్య బృందం చక్కని నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమం లో డా గండ్ర లక్ష్మణరావు, డా బివిఎన్ స్వామి, గాజుల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ ఆలయం వద్ద ఉద్రిక్తత, బీజేపీ నేతలను అడ్డుకున్న పోలీసులు

- సంప్రోక్షణకు బీజేపీ యత్నం
- ఆలయ ప్రవేశానికి అనుమతి నిరాకరణ
- పోలీసులు-బీజేపీ మధ్య వాగ్వాదం
- ఆలయ పవిత్రతపై బీజేపీ అభ్యంతరం
- ఉద్రిక్తతతో భారీ బందోబస్తు
- ఆలయ వద్ద ఉద్రిక్త వాతావరణం
- సంప్రోక్షణకు బీజేపీ డిమాండ్
- శాంతిభద్రతల దృష్ట్యా చర్యలన్న పోలీసులు
- రాజకీయంగా మారిన ఆలయ వివాదం పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు



**వరంగల్ వెలుతురు జూలై 04:**

వరంగల్ నగరంలోని ప్రముఖ భద్రకాళీ ఆలయం వద్ద శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు తడిబట్టలతో ఆలయంలో స్నానాలు చేయడం వల్ల ఆలయ పవిత్రతకు భంగం కలిగిందని ఆరోపించిన బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆలయ సంప్రోక్షణ నిర్వహించేందుకు ఆలయానికి చేరుకున్నారు.అయితే పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఆలయ ప్రాంగణంలోకి అనుమతించలేదు. దీంతో బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఆలయ పవిత్రతను పునరుద్ధరించేందుకు సంప్రోక్షణ తప్పనిసరిగా నిర్వహించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ముందస్తు చర్యగా వారిని అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో భద్రకాళీ ఆలయం వద్ద రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలయ పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులో ఉంచారు.

# న్యాయ వ్యవస్థ బలోపేతానికి సంస్కరణలు అవసరం: మంత్రి వివేక్ వెంకటస్వామి







- ప్రభుత్వం-న్యాయ వ్యవస్థ మధ్య సమతుల్యత ఉండాలి
- యువ న్యాయవాదులు నిరంతర అధ్యయనంతో రాణించాలి

**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయ వ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే న్యాయ సంస్కరణలు అవసరమని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీస్ మరియు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి గారు అన్నారు. ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ తమ పరిధిలో బలంగా పనిచేస్తూ సమతుల్యతను పాటించినప్పుడే ప్రజాస్వామ్య విలువలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫ్యాప్సిలో నిర్వహించిన నేషనల్ లీగల్ కాంక్లేవ్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐసీసీ మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబ, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, యువ కాంగ్రెస్ నాయకులు హాజరైన ఈ సదస్సులో రాజ్యాంగ పరిరక్షణ, న్యాయ వ్యవస్థ బలోపేతం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో పాటు సమకాలీన న్యాయ అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి గారు మాట్లాడుతూ.. రాజకీయాలు, మీడియా సహా అనేక రంగాల్లో కాలానుగుణంగా సంస్కరణలు వస్తున్నాయని, న్యాయ వ్యవస్థలోనూ అవసరమైన సంస్కరణలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయ వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు ప్రభుత్వాలు బలపడతాయని, అందువల్ల ప్రభుత్వం—న్యాయ వ్యవస్థ మధ్య సమతుల్యత అత్యంత కీలకమని పేర్కొన్నారు. న్యాయ సంస్కరణలపై ఈ వేదిక లోతైన చర్చ జరిపి, న్యాయ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా సూచనలు చేయాలని కోరారు.స్వాతంత్ర్య ఉద్యమంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని మంత్రి గుర్తుచేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాగిన స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది న్యాయవాదులు ఉద్యమకారుల తరఫున కేసులు వాదించి విజయాలు సాధించారని తెలిపారు. న్యాయవాద వృత్తిలో ఒక అంశాన్ని అనుకూల, ప్రతికూల కోణాల్లో పరిశీలించే అవకాశం ఉంటుందని, తద్వారా సమాజంలోని సమస్యలపై సమగ్ర దృక్పథం ఏర్పడుతుందన్నారు.యువ న్యాయవాదులు నిరంతరం అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. కోర్టుల్లో కేసుల వాదనలు వినడం, న్యాయపరమైన అంశాలను లోతుగా అధ్యయనం చేయడం, ఎక్కువ కేస్ స్టడీస్ చదవడం ద్వారా వృత్తిపరమైన పునాది బలపడుతుందని చెప్పారు. యూత్ కాంగ్రెస్ కల్పించిన ఈ అవకాశాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకొని న్యాయ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి వివేక్ వెంకటస్వామి గారు పిలుపునిచ్చారు.

# పోలీస్ సంక్షేమానికి మరో అడుగు.. అల్లాపూర్‌లో బ్యారక్స్ ప్రారంభించిన సీపీ డా. యం. రమేష్





**హైదరాబాద్ వెలుతురు జూలై 04:**

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ సిబ్బంది వసతి అవసరాల కోసం నూతనంగా నిర్మించిన బ్యారక్ లను లను శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్, ఐపీఎస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో సమర్థవంతంగా సేవలందించాలంటే వారికి మెరుగైన వసతి, సంక్షేమ సౌకర్యాలు కల్పించడం అత్యంత ముఖ్యమని అన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం కమిషనరేట్‌లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.నూతనంగా నిర్మించిన మహిళా, పురుషుల బ్యారక్స్ ద్వారా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వసతి అందుబాటులోకి వస్తుందని అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతన బ్యారక్స్ ప్రారంభం పట్ల అల్లాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ, పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ గారికి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రితిరాజ్, ఐపీఎస్, ఏసీపీ పి. నరేష్ రెడ్డి, అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకట్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పశ్చిమాసియా ఇంధన సంక్షోభాన్ని విజయవంతంగా ఎదుర్కొన్నాం: ప్రధాని మోదీ

- ప్రజలపై భారం పడకుండా లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకం తగ్గింపు
- రాజస్థాన్‌లో దేశ తొలి గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ-పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ప్రారంభం
- ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం కలిగిన దేశంగా భారత్
- బలమైన దౌత్యం, ప్రత్యామ్నాయ దిగుమతులతో సంక్షోభాన్ని అధిగమించామని వెల్లడి
- భారత్ విఫలమవుతుందని విష ప్రచారం చేసిన వారి అంచనాలు తప్పాయని వ్యాఖ్య
- ప్రజలను రెచ్చగొట్టే కుట్రలు ఫలించలేదని మోదీ విమర్శ
- భాజపా ప్రభుత్వం
- శంకుస్థాపనలకే పరిమితం కాదని స్పష్టం
- పనులు పూర్తయ్యే వరకు నిరంతరం కృషి చేస్తామని ప్రధాని హామీ




**ఢిల్లీ వెలుతురు జూలై 04:**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రభుత్వ ముందస్తు ప్రణాళికలు, ఇంధన దిగుమతుల్లో వైవిధ్యం, వివిధ దేశాలతో బలమైన ద్వైపాక్షిక సంబంధాల వల్ల సంక్షోభ ప్రభావాన్ని ప్రజలపై పడకుండా అడ్డుకోగలిగామని చెప్పారు.


రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ–పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను శనివారం ప్రారంభించిన మోదీ, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు.పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభానికి ముందు భారత్ 25 నుంచి 26 దేశాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకునేదని, సంక్షోభం తలెత్తిన తర్వాత ఆ సంఖ్యను 40కి పైగా దేశాలకు పెంచామని మోదీ తెలిపారు. ఒకే ప్రాంతంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ వనరులను గుర్తించడం వల్ల దేశానికి ఇంధన సరఫరాలో అంతరాయం కలగలేదన్నారు.అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఒక్కసారిగా పెరగడంతో ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు రూ.75 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని చెప్పారు. అయితే ఆ భారం ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించిందన్నారు. సాధారణ ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించినట్లు గుర్తు చేశారు.ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద చమురు శుద్ధి సామర్థ్యం కలిగిన దేశంగా భారత్ ఎదిగిందని ప్రధాని పేర్కొన్నారు. దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయడంలో కొత్త రిఫైనరీలు, పెట్రో కెమికల్ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.భారత్ విఫలమవుతుందని కొందరు విష ప్రచారం చేశారని, ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నాలు కూడా జరిగాయని మోదీ విమర్శించారు. అయితే ప్రజలు వాటిని నమ్మలేదని, దేశం సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొనడంతో భారత్‌పై అనుమానాలు వ్యక్తం చేసిన వారు ఇప్పుడు నిరాశ చెందుతున్నారని అన్నారు.భాజపా ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలు చేసి వదిలేయవని, ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తూ అమలు చేస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# తెలంగాణ పర్యాటక సంస్కరణలకు నీతి ఆయోగ్ ప్రశంస

**హైదరాబాద్, వెలుతురు జూలై 4:**





పర్యాటక, ఆతిథ్య రంగ అభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలను నీతి ఆయోగ్ ప్రశంసించడం రాష్ట్రానికి దక్కిన గౌరవమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు.ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన "Unlocking Growth in Tourism and Hospitality Sector" నివేదికలో పర్యాటక రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న విధానాలను ప్రత్యేకంగా ప్రస్తావించడం ఆనందదాయకమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పరంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించాలని నీతి ఆయోగ్ సూచించడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు లభించిన గుర్తింపేనని అన్నారు.హోటళ్ల నిర్మాణానికి సంబంధించి నిబంధనల సరళీకరణ, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు, భూమి వినియోగంలో వెసులుబాటు, ఫ్లోర్ ఏరియా రేషియో (FAR) పెంపు, పార్కింగ్ నిబంధనల సరళీకరణ, సింగిల్ విండో విధానం బలోపేతం వంటి చర్యలు తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాయని మంత్రి తెలిపారు.ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ పర్యాటక విధానం–2025 - 2030 ఇప్పటికే విశేష ఫలితాలను ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు మార్గం సుగమమైందని తెలిపారు.గతంలో కూడా తెలంగాణ పర్యాటక రంగంలోని పలు ఉత్తమ కార్యక్రమాలు, పర్యాటక ప్రాంతాలకు నీతి ఆయోగ్ నివేదికల్లో స్థానం దక్కిందని మంత్రి గుర్తు చేశారు. తాజాగా మరోసారి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణను ఆదర్శంగా పేర్కొనడం రాష్ట్ర పర్యాటక రంగం సరైన దిశలో ముందుకు సాగుతోందనడానికి నిదర్శనమని అన్నారు.భవిష్యత్తులో పెట్టుబడిదారులకు మరింత అనుకూలమైన విధానాలు అమలు చేస్తూ, ప్రపంచ స్థాయి పర్యాటక మౌలిక వసతులు కల్పించి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.



# అతిగా ఆలోచిస్తే.. మీ పనైపోయినట్లే

ప్రస్తుత గజిబిజీ జీవితంలో అంతా యాంత్రికంగా మారిపోయింది. ఉదయం లేచింది మొదుల రాత్రి పడుకునే వరకు ఒత్తిడితో సావాసం చేయకతప్పని పరిస్థితి. దీంతో ఇది మానసిక సమస్యలకు సైతం దారి తీస్తోంది. ముఖ్యంగా అతిగా ఆలోచించే వారి సంఖ్య పెరుగుతోంది. చిన్న సమస్యను కూడా పెద్దగా ఆలోచిస్తున్నారు. కాలికి దెబ్బ తగిలినా.. ఏదో జరిగిపోతోందని ఆందోళన చెందుతున్నారు. ఇలా అతిగా ఆలోచించడం కూడా మానసిక సమస్యకు సంకేతంగా నిపుణులు చెబుతున్నారు. అతిగా ఆలోచించడం వల్ల ఎన్నో రకాల ఇతర సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు. ఈ కారణంగా నిద్రలేమి, తలనొప్పి, అధిక రక్తపోటుతో పాటు ఇత శారీరక సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆందోళన, గుండెదడ పెరగడం ఇలాంటివన్నీ అతిగా ఆలోచించడం తాలుకూ లక్షణంగా చెప్పొచ్చు. అయితే అతిగా ఆలోచించడాన్ని క్రమంగా తగ్గించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అతిగా ఆలోచించడం సమస్య నుంచి బయటపడాలంటే.. యోగా, మెడిటేషన్ వంటి వాటిని అలవాటు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ప్రతీ రోజూ కచ్చితంగా 15 నుంచి 20 నిమిషాలైనా కళ్లు మూసుకొని శ్వాసపై ధ్యాస పెట్టాలి. ప్రతికూల ఆలోచనల నుంచి బయటకు వచ్చేందుకు మార్గాలను అన్వేషించాలి. ఏదో జరిగిపోతుందన్న భయం నుంచి బయటకు రావాలి. ఇక సాధారణంగా అతిగా ఆలోచించడానికి ప్రధాన కారణాలు.. గతం గురించి బాధ పడడం లేదా భవిష్యత్తు గురించి ఆందోళన చెందడమే ఉంటాయి. అందుకే ప్రస్తుతంలో జీవించడాన్ని అలవాటుగా మార్చుకోవాలి. అన్ని బాధలను వదిలేసి వర్తమానాన్ని ఆస్వాదించడం అలవాటు చేసుకోవాలి. ప్రస్తుత కాలాన్ని పూర్తిగా ఆస్వాదించాలి. ఎప్పుడూ ఒక్కరే ఒంటరిగా ఉండకూడదు. నలుగురితో కలిసి జీవించడాన్ని అలవాటు చేసుకోవాలి. పాజిటివ్ ఆలోచనతో ముందుకు వెళ్లాలి. మీ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. సమస్యల గురించి ఆలోచించి బాధపడేకంటే వాటి పరిష్కారం దిశగా ఆలోచించాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంగా ఇలాంటి సమస్యతో బాధపడుతున్నట్లయితే.. ఎలాంటి సందేహం లేకుండా మానసిక నిపుణులను సంప్రదించాలి. వారి వీటికి సరైన చికిత్స అందిస్తారు.





# డిప్రెషన్ లక్షణాలు ఇవే.. మీలో ఉన్నాయా? తెలుసుకోండి

డిప్రెషన్ ఇప్పుడు ప్రపంచం మొత్తం ఎక్కడ చూసినా ఈ సమస్యే గురించే చర్చ జరుగుతోంది. దాదాపు ప్రపంచవ్యాప్తంగా 28 కోట్ల మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్టు ఓ అంచనా ఉంది. అయితే ఇంత తీవ్రమైన డిప్రెషన్ సమస్య అసలు ఎందుకు వస్తుంది? దీని లక్షణాలు ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.. డిప్రెషన్ అనేది చిన్న సమస్య కాదు. ఇది ఒక తీవ్రమైన మానసిక రుగ్మత. తమకు తెలియకుండానే ఆ వ్యాధి బారిన పడి అర్ధాంతరంగా ప్రాణాలు తీసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. శారీరక సమస్యలు, గాయాలు బయటికి కనిపిస్తాయి. వాటిని వైద్యులు గుర్తించగలరు, కానీ డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు గుర్తించడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఈ లోపే కొంతమంది డిప్రెషన్ వల్ల కలిగే ఒత్తిడిని తట్టుకోలేక మరణిస్తున్నారు. ది కాన్ఫరెన్స్ బోర్డ్ డేటా చెబుతున్న ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 28 కోట్ల మంది ప్రజలు డిప్రెషన్ తో బాధపడుతున్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వారిలో 34 శాంతం మంది ఈ డిప్రెషన్ బారిన పడినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇంట్లో కార్యాలయంలో ఉన్న పని ఒత్తిడి వల్లే అధికంగా వారికి డిప్రెషన్ వస్తున్నట్లు కూడా అధ్యయనాలు వివరిస్తున్నాయి.

## చికిత్స అవసరమేనా?

డిప్రెషన్ కు కచ్చితంగా చికిత్స తీసుకోవాలి. ఇది ఒక వైద్య పరిస్థితి గానే చెబుతారు నిపుణులు. ఇది శారీరక సమస్యలతో పాటు భావోద్వేగ సమస్యలకు కారణం అవుతుంది. రోజువారీ జీవితాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. దీనికి మెరుగైన వైద్యం అందుబాటులో ఉంది. కాబట్టి డిప్రెషన్ లక్షణాలు ఉన్నవారు కచ్చితంగా మానసిక వైద్యులను కలిసి తగిన చికిత్స తీసుకుంటే సంతోషకరమైన జీవితాన్ని గడపగలరు.

## లక్షణాలు ఏమిటి?

డిప్రెషన్ బారిన పడినవారు శక్తి లేనట్టు వ్యవహరిస్తారు. తమలో తామే కుంగిపోతారు. ఎక్కువ సమయంపాటూ అలసిపోయినట్టు కనిపిస్తారు. ఎక్కువగా నిద్రపోవడం లేదా తక్కువగా నిద్రపోవడం వంటివి చేస్తారు. వారికి ఏ పని పైనా ఆసక్తి ఉండదు. బరువు విపరీతంగా పెరిగిపోతారు. లేదా తగ్గిపోతారు. ఏకాగ్రత వారిలో లోపిస్తుంది. ఖాళీగా కూర్చోవడానికి ఇష్టపడతారు. అలా కూర్చున్నప్పుడు కూడా విచారంగా ఉంటారు. వారిలో అప్పుడప్పుడు ఆత్మహత్య ఆలోచనలు కూడా వస్తూ ఉంటాయి. అలాగే తమకు ఆత్మ గౌరవం లేదని, ప్రజలు తమకు విలువ ఇవ్వడం లేదని భావిస్తూ ఉంటారు. చిన్న చిన్న విషయాలకే చిరాకు పడతారు. ఇంట్లో వారిపై అరుస్తూ ఉంటారు. మీకు తెలియకుండానే మీలో ఇలాంటి లక్షణాలు వచ్చాయేమో తెలుసుకోండి. మీ అతి కోపానికి, అతి చిరాకుకు, పెరుగుతున్న బరువుకు, నిద్రలేమికి, నీరసానికి కారణం డిప్రెషన్ కూడా కావచ్చు. డిప్రెషన్ బారిన పడడానికి ఎన్నో రకాల కారణాలు ఉన్నాయి. మెదడులోని రసాయన స్థాయిల్లో అసమతుల్యత ఏర్పడినా కూడా మూడ్ డిజార్డర్స్ అనేవి వస్తాయి. ఇవి డిప్రెషన్ కు దారితీస్తాయి. అలాగే జీవితంలో ప్రియమైన వ్యక్తిని కోల్పోవడం, ఏదైనా అసాధారణ సంఘటనలు జరగడం, ఉద్యోగం లేకపోవడం వంటివి కూడా డిప్రెషన్ కు దారితీస్తాయి. కొన్నిసార్లు కుటుంబ వారసత్వంగా కూడా డిప్రెషన్ వచ్చే అవకాశం ఉంది.



# ఉప్పుతో ప్రాణాంతక వ్యాధి



వంటలో ఎన్ని రకాల మసాలాలు వేసినా ఉప్పు సరిపడా లేకపోతే రుచిగా ఉండదు. కూరకు రుచిని ఇచ్చే ఉప్పు వల్ల ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు ఉన్నాయని నిపుణులు చెబుతూనే ఉన్నారు. అధిక రక్తపోటు మొదలు, కిడ్నీ సంబంధిత సమస్యల వరకు ఎన్నో అనారోగ్య సమస్యలకు ఉప్పు ప్రధాన కారణమని హెచ్చరిస్తున్నారు. అయితే మనకు తెలిసినంత వరకు ఉప్పు ఎక్కువగా తీసుకుంటే వచ్చే సమస్యలు ఇవే.. కానీ ఉప్పు అధికంగా తీసుకోవడం వల్ల ప్రాణాంతక సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉందని తాజాగా జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది. భోజనం చేసే సమయంలో కూరల్లో అదనంగా ఉప్పు వేసుకోవడం వల్ల జీర్ణాశయ క్యాన్సర్ ముప్పు పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని తాజాగా నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా అతి ఎక్కువగా కనిపిస్తున్న క్యాన్సర్లలో జీర్ణాశయ క్యాన్సర్ ఐదోదని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అసలు జీర్ణాశయ క్యాన్సర్‌కు కారణం ఏంటన్న దాని గురించి పరిశోధనలు నిర్వహించారు. ఈ పరిశోధనల్లోనే ఈ సంచలన విషయాలు వెల్లడయ్యాయి. తరచూ ఉప్పు కలిపి తినేవారికి పొట్ట క్యాన్సర్ ముప్పు 41% ఎక్కువగా ఉంటున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఉప్పు అధికంగా తీసుకోవడం వల్ల జీర్ణాశయం లోపల జిగురుపొర దెబ్బతింటుంది. ఇది కాస్త పైలోరీ బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి దోహదం చేస్తుంది. ఇది జీర్ణాశయ పైపొర కణాలను దెబ్బతీయటం వంటి చర్యలకు కారణమవుతుంది. దీర్ఘకాలంగా ఇది క్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తుందని అధ్యయనంలో తేలింది. భవిష్యత్తులో జీర్ణాశయ క్యాన్సర్ బారినపడకుండా ఉండాలంటే ఉప్పును అధికంగా తీసుకోవడం తగ్గించాలని నిపుణులే చెబుతున్నారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com